# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

తొమ్మిదవ పాఠము

## అస్తిత్వ దృష్టికోణము: మేలును ఉద్దేశించుట

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్న వారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతం ........ 1
హేతువుల యొక్క ప్రాముఖ్యత ........ 2
భావన ........ 2
సంక్లిష్టమైన ........ 3
సాధారణ మరియు ప్రత్యేకమైన ........ 3
తెలిసిన మరియు తెలియని ........ 4
అవసరత ........ 4
హృదయము ........ 5
వేషధారణ ........ 6
సద్గుణము ........ 8
విశ్వాసము అను హేతువు ........ 10
రక్షింపబడు విశ్వాసము ........ 11
ఆరంభ రక్షణకు మాధ్యమము ........ 11
కొనసాగు సమర్పణ ........ 13
మారుమనస్సు ........ 17
నిరీక్షణ ........ 21
ప్రేమ అను హేతువు ........ 24
ఆజ్ఞాధారకత్వము ........ 26
స్వామిభక్తి ........ 26
ధోరణి ........ 29
బాధ్యత ........ 31
క్రియలు (1:19-27) ........ 33
ప్రాయశ్చిత్త కృప ........ 33
సకల జనులకు వర్తించు కృప ........ 35
అనురాగము ........ 38
కృతజ్ఞత కలిగియుండుట ........ 40
భయము ........ 42
ముగింపు ........ 45



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

తొమ్మిదవ పాఠము

అస్తిత్వ దృష్టికోణము: మేలును ఉద్దేశించుట

## ఉపోద్ఘాతం

పిల్లలు కొన్నిసార్లు వస్తువులను పగలగొడతారని తల్లిదండ్రులు అందరికీ తెలుసు. అది ఒక వస్తువు కావచ్చు, ఒక బొమ్మ కావచ్చు, లేక ఒక అలంకరణ కావచ్చు. కాని అప్పుడప్పుడు, పిల్లలందరూ ఉద్దేశపూర్వకముగానే కొన్ని వస్తువులను నాశనం చేస్తుంటారు. ఇప్పుడు, తల్లిదండ్రులు, దీనికి అనేక విధాలుగా స్పందించవచ్చు. ఒక బిడ్డ ఉద్దేశపూర్వకముగా దేనినైనా పగలగొడితే, మనకు కోపం రావచ్చు. ఒకవేళ ఆ బిడ్డ నిర్లక్ష్యముగా లేక అవిధేయతగా ఉంటే మనము వానిని కొడతాము కూడా. కాని ఒకవేళ అది నిజముగా పొరపాటున జరిగితే, మనకు అసలు కోపము రాక పోవచ్చు.

ఇన్ని విభిన్నమైన విధానములలో మనము ఎందుకు స్పందిస్తాము? మనము మన బిడ్డల యొక్క హేతువులను పరిగణలోనికి తీసుకుంటాము కాబట్టి, మన ప్రతిస్పందనలు భిన్నముగా ఉంటాయి. వారి హేతువులను మనము విశ్లేషించు విధానము ఆధారంగా మనము అసలు స్పందించకపోవచ్చు, కొంత సానుభూతితో స్పందించవచ్చు, లేక కోపముతో స్పందించవచ్చు. పెద్దలు తీసుకొను నైతిక నిర్ణయముల విషయములో కూడా ఇలాంటిదే వాస్తవమైయున్నది. నీతిశాస్త్రమును మన హేతువుల నుండి ఏనాడు వేరుగా చూడకూడదు. మన హేతువులు, ఆశలు మరియు ఉద్దేశాలు మనము తీసుకొను ప్రతి నైతిక నిర్ణయములో పరిగణించవలసిన ప్రాముఖ్యమైన విషయములైయున్నవి.

*బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట* అను మన పాఠ్యక్రమములో ఇది తొమ్మిదవ పాఠము. మరియు దీనికి "అస్తిత్వ దృష్టికోణము: మేలును ఉద్దేశించుట" అను శీర్షికనిచ్చాము. ఈ పాఠములో, మన హేతువులు మరియు ఉద్దేశములు మనము తీసుకొను నిర్ణయాల యొక్క నైతికత మీద ప్రభావము చూపు విధానములను చూస్తూ నీతిశాస్త్రము మీద అస్తిత్వ దృష్టికోణమును మనము పరిశోధిద్దాము.

మీకు జ్ఞాపకమున్నట్లయితే, బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుటకు మనము ఉపయోగించు పద్ధతి ఏమనగా, నైతిక తీర్పులలో ఒక వ్యక్తి ఒక పరిస్థితికి దేవుని వాక్యమును అనువర్తించుట భాగమైయున్నది. దేవుని వాక్య నిబంధనల వెలుగులో మనము మన ఎంపికలను చూసినప్పుడు, మనము నిర్ణాయక దృష్టికోణమును ఉపయోగించుచున్నాము. పరిస్థితుల మీద దృష్టిపెట్టినప్పుడు, మనము పరిస్థితుల దృష్టికోణమును ఉపయోగించుచున్నాము. మరియు నైతిక ప్రశ్నలలో పాలుపంచుకొను ప్రజలను మనము పరిగణించునప్పుడు, అస్తిత్వ దృష్టికోణమును ఉపయోగించుచున్నాము. ఈ పాఠములో, అస్తిత్వ దృష్టికోణము యొక్క పరిశోధనను మనము కొనసాగిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మంచి నైతిక ఎంపికను చేయుటకు అవసరమైన ప్రజలు లేక వ్యక్తుల రకములను విశదీకరిస్తూ మునుపటి పాఠములో మనము అస్తిత్వ దృష్టికోణమును పరిచయం చేశాము. విశేషముగా, దీనికి మంచి ప్రజలు అవసరమైయున్నారు, మంచివారు అనగా యేసు క్రీస్తు నందు విశ్వాసము మూలముగా దేవుని కృప ద్వారా విమోచించబడినవారు.

ఈ పాఠములో, అస్తిత్వ దృష్టికోణములోని మరొక విషయము మీద మనము దృష్టి పెడదాము: మన నైతిక హేతువులు. మనము చూడబోవుచున్నట్లు, దేవుని సంతోషపరచుటకు, మంచి ప్రజలు మంచి కారణము నిమిత్తము మంచి పనిని చేయవలసియున్నది; వారి హేతువులు నీతిగలవైయుండాలి.

మేలును ఉద్దేశించుటను గూర్చిన మన పాఠము మూడు భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, హేతువు అంటే ఏమిటి మరియు హేతువులకు మంచి ప్రవర్తనకు మధ్య సంబంధము ఏమిటి? అనునటు వంటి ప్రశ్నలకు జవాబిస్తూ హేతువుల యొక్క ప్రాముఖ్యతను మనము చర్చిద్దాము. రెండవదిగా, విశ్వాసము అను హేతువు బైబిలానుసారమైన నీతిశాస్త్రములో ఒక కీలకమైన విషయము అని చర్చిద్దాము. మరియు మూడవదిగా, మనము కలిగియుండాలని బైబిలు ప్రోత్సహించు ప్రేమ అను హేతువు మీద దృష్టిపెడదాము. నీతిశాస్త్రములో హేతువుల యొక్క ప్రాముఖ్యతతో ఆరంభిద్దాము.

## హేతువుల యొక్క ప్రాముఖ్యత

మొదటిగా హేతువు అను భావనను పరిగణించుట ద్వారా, మరియు రెండవదిగా సరియైన హేతువులను కలిగియుండవలసిన అవసరతను గూర్చి మాట్లాడుట ద్వారా హేతువుల యొక్క ప్రాముఖ్యతను మనము చర్చిద్దాము. హేతువు అను భావనను చూస్తూ ఆరంభిద్దాము.

### భావన

హేతువులను గూర్చి మనము సాధారణంగా రెండు మౌలికమైన మార్గములలో మాట్లాడవచ్చు. ఒక వైపున, హేతువు అనగా మనము ఒక కార్యమును చేయుట వెనుక ఉన్న ఉద్దేశ్యము అయ్యున్నది — అనగా మనము సాధించాలని నిరీక్షించునది. మరొక వైపున, ఒక హేతువు ఒక కార్యము వెనుక కారణము కూడా అయ్యుండవచ్చు.

మొదటి భావనలో, హేతువులు లక్ష్యములను పోలియున్నాయి, లక్ష్యములను గూర్చి మునుపటి పాఠములలో పరిస్థితుల దృష్టికోణమును చూస్తూ పరిశీలించాము. కాబట్టి, ఈ పాఠములో, కార్యములకు కారణములుగా హేతువుల మీద దృష్టిపెడదాము.

కారణము మరియు పర్యవసానము అను భావన సాధారణ అనుభవములో ఒక సుపరిచితమైన విషయమే. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఒక బంతిని తన్నినప్పుడు, తన్నుట ఆ బంతి కదులుటకు కారణమైయున్నది అని మనము చెప్పవచ్చు. మరియు బంతి యొక్క చలనము ఆ తన్నుట యొక్క పర్యవసానము లేక ఫలితము అయ్యున్నది. ఇలాంటి అనేక ఇతర ఉదాహరణలను గూర్చి మనము ఆలోచించవచ్చు. వర్షం తడిసేల అను పర్యవసానమునకు దారితీస్తుంది. కన్నులు మూయుట వలన చూడలేకపోవుటకు కారణమవుతుంది. రోజంతా పనిచేయుట అలసటకు కారణమవుతుంది.

సరే, మానవ హేతువులు మరియు కార్యముల విషయములో కూడా ఇలాంటిదే వాస్తవమైయున్నది. హేతువులు కారణములుగా పనిచేస్తాయి, మరియు మన కార్యములు అవి కలిగించు పర్యవసానములు అయ్యున్నవి. ఈ భావనలో, హేతువు అనగా మనలను కార్యము చేయునట్లు పురికొల్పు ఒక అంతరంగ నియమము అయ్యున్నది. ప్రవర్తన గుణములు, ఆశలు, భావనలు, సమర్పణలు, మరియు మనలను కార్యము చేయునట్లు పురికొల్పు మనలో ఉన్న ప్రతిది అంతరంగ నియమములు అయ్యున్నవి.

హేతువులను గూర్చిన ఈ మౌలిక భావనను మనస్సులో ఉంచుకొని, మనము మూడు క్లుప్త వ్యాఖ్యలను చేయవలసియున్నది.

## సంక్లిష్టమైన

మొదటిగా, హేతువులు సాధారణంగా సంక్లిష్టమైనవైయుంటాయి. సామాన్య పరిస్థితులలో, అనేక ప్రవర్తన గుణములు, ఆశలు, భావనలు మరియు సమర్పణలు కలిసి మనలను నైతిక నిర్ణయములను తీసుకొనుటలోనికి నడిపిస్తాయి.

ఉదాహరణకు, తన కుటుంబ పోషణ కొరకు సంపాదించుటకు పనికి వెళ్లే ఒక తండ్రిని పరిగణించండి. అతడు తన భార్యను మరియు పిల్లలను ప్రేమిస్తాడు, వారికి సమకూర్చుట పట్ల సమర్పణ కలిగియుంటాడు, మరియు తన కొరకు కూడా అతడు ఆహారమును, వస్త్రములను మరియు గృహమును ఆశిస్తాడు. అదే సమయములో, అతడు సంఘర్షించు ఆశలను కూడా కలిగియుండవచ్చు, అవి ఇంటి వద్ద ఉండి సేదతీరుట, లేక తన ఇంటిని బాగుచేసుకొనుట, లేక విహారయాత్రకు వెళ్లుట వంటివి. ఈ అంతరంగ నియమములన్నీ అతనిలో విభిన్నమైన స్థాయిలలో ఉద్రిక్తత మరియు సామరస్యము కలిగి ఉనికిలో ఉంటాయి. అయితే చివరికి, ఈ హేతువుల యొక్క సంకీర్ణ ప్రభావము ఎక్కువ రోజులు అతనిని పని చేయునట్లు పురికొల్పుతాయి.

## సాధారణ మరియు ప్రత్యేకమైన

రెండవదిగా, కొన్ని హేతువులు చాలా సాధారణమైనవి, మరి కొన్ని హేతువులు ప్రత్యేకమైనవి. మరియు అనేక హేతువులు ఈ రెంటి మధ్య ఉనికిలో ఉంటాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఉదాహరణకు, నశించినవారికి సువార్త ప్రకటించాలి అను మన క్రైస్తవ ఆశ ఒక సాధారణ హేతువు అయ్యున్నది. ప్రజలు యేసును నమ్మాలి మరియు లోకమంతా రాజ్యములోనికి తేబడాలి అను మన ఆశ ద్వారా మనము పురికొల్పబడతాము. అయితే కొన్నిసార్లు మనము కలిసిన ఒక వ్యక్తితో ఒక ప్రత్యేకమైన రీతిలో సువార్తను పంచుకొనుటకు మనము పురికొల్పబడతాము. మరికొన్నిసార్లు మన హేతువులు ఈ రెండు తీవ్రతల మధ్య ఉంటాయి; సువార్తను ప్రకటించుటకు అవిశ్వాసులను వెదుకుచు మనము బయటకు వెళ్లవచ్చు.

### తెలిసిన మరియు తెలియని

మూడవదిగా, సంక్లిష్టముగాను, ఎంతో కొంత వరకు సాధారణముగా మరియు ప్రత్యేకముగా ఉండుటతో పాటుగా, మన హేతువులు మనకు తెలిసినవి మరియు తెలియనివి కూడా అయ్యుండవచ్చు. మన హేతువులలో కొన్ని మనకు తెలుసు, కాని మన హేతువులన్నిటిని గూర్చి మనము ఏనాడు సంపూర్ణ అవగాహనను పొందలేము.

ఉదాహరణకు, ఒక మనుష్యుడు భోజనము చేస్తే, అతని హేతువు ఆకలి అని మనము సరిగానే చెప్పవచ్చు. ఆకలి అనునది అంతర్గత భావన అయ్యున్నది మరియు ఉనికి యొక్క స్థితి అయ్యున్నది, మరియు ఆకలిగొనిన వ్యక్తి తన ఆకలిని గూర్చి ఎరిగియుంటాడు.

అయితే ప్రజలు కొన్నిసార్లు దుఖములో ఉన్నప్పుడు మరియు ఆదరణను కోరునప్పుడు కూడా తింటారు అని మానసికశాస్త్రము మరియు సాధారణ అనుభవము మనకు బోధిస్తుంది. ఈ సందర్భములలో, వారి ముఖ్య హేతువు ఆదరణను పొందుట, దుఖమును అధిగమించుట అయ్యున్నది అని ఆహారమును తీసుకొను ప్రజలకు తెలియదు.

హేతువుల యొక్క మౌలిక భావనను మరియు కొన్ని సంక్లిష్టతలను చర్చించాము కాబట్టి, సరియైన హేతువును కలిగియుండవలసిన అవసరతను చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము. నీతిశాస్త్రములో హేతువులు ఎందుకు ఇంత ప్రాముఖ్యమైయున్నవి.

## అవసరత

విచారకరముగా, నైతికముగా ఉండుట అంటే బాహ్యముగా దేవుని చిత్తమునకు విధేయత చూపుట మాత్రమే అని నమ్ము ఉచ్చులో క్రైస్తవులు చాలాసార్లు పడిపోతారు. మనము సరియైన హేతువులను మరియు ఆశలను కలిగియుండాలని దేవుడు ఆశించుట లేదని మనము పొరపాటున అనుకుంటాము. కొన్నిసార్లు ప్రవర్తనలను గుర్తించుట మరియు సరిచేసుకొనుట సులువైన పని కాబట్టి ఇలా జరుగుతుంది. కొన్నిసార్లు, మన కాపరులు మరియు బోధకులు అంతరంగ ఆశలు మరియు సమర్పణలకు బదులుగా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రవర్తనల వైపుకు మన దృష్టిని ఆకర్షిస్తారు కాబట్టి ఇలా జరుగుతుంది. మరియు ఇతర కారణములు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా, మనము నిజముగా నైతికమైన వ్యక్తులుగా ఉండగోరితే, మన దేవుని-గౌరవించు ప్రవర్తనలు దేవుని-గౌరవించు హేతువులలో నాటబడియుండాలి.

సరియైన హేతువు కలిగియుండవలసిన అవసరతను మనము మూడు మార్గములలో విశదీకరిద్దాము. మొదటిగా, సత్క్రియలు హృదయములో నుండి ప్రవహించాలి అను బైబిలు అవసరతను మనము చూద్దాము. రెండవదిగా, బైబిలు వేషధారణను ఖండించు విషయమును పరిగణిద్దాము. మరియు మూడవదిగా, క్రైస్తవ సద్గుణము నైతికమైన మంచి హేతువులకు మూలమైయున్నది అని మనము చూద్దాము. సత్క్రియలు హృదయపూర్వకముగా చేయబడాలి అను ఆలోచనతో ఆరంభిద్దాము.

## హృదయము

లేఖనము మానవ హృదయమును గూర్చి అనేక విధాలుగా మాట్లాడుతుంది. అయితే మన ఉద్దేశ్యముల కొరకు, హృదయము మన అంతరంగ వ్యక్తిత్వము యొక్క లోతైయున్నది మరియు మన హేతువులకు పీఠము అయ్యున్నది అని బైబిలు ఇచ్చు వర్ణన మీద దృష్టిపెడదాము. లేక ఈ పాఠములో ఇంతకు ముందు మనము చూసిన పదములలో, హృదయము మన అంతరంగ నిర్ణయములన్నిటి యొక్క మొత్తము అయ్యున్నది అను విషయము మీద దృష్టిపెడదాము. ఈ భావనలో, హృదయము, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మరియు ప్రాణము అను బైబిలు అంశముల మధ్య ఎంతో అతివ్యాప్తి ఉంటుంది.

1 దిన. 28:9ని వినండి, అక్కడ దావీదు హేతువులు లేక సంకల్పములు మరియు హృదయము మధ్య దగ్గర సంబంధమును వెలికితీశాడు:

> సొలొమోనా, నా కుమారుడా, నీ తండ్రియొక్క దేవుడైన యెహోవా అందరి హృదయములను పరిశోధించువాడును, ఆలోచనలన్నిటిని సంకల్పములన్నిటిని ఎరిగినవాడునై యున్నాడు. నీవు ఆయనను తెలిసికొని హృదయపూర్వకముగాను మనః పూర్వకముగాను ఆయనను సేవించుము (1 దిన. 28:9).

ఈ వాక్యభాగములో, దేవుని పట్ల విధేయత మన అంతరంగ వ్యక్తిత్వము యొక్క లోతుల నుండి ప్రవహించాలి అని దావీదు తన కుమారునికి బోధించాడు. దీనికి హృదయపూర్వక అంకితభావము మరియు మనఃపూర్వకమైన మనస్సు అవసరమైయున్నది. దేవుడు కేవలం మన బాహ్య విధేయత మీద ఆసక్తి కలిగిలేడు. ప్రతి హృదయము మరియు ఆలోచనల వెనుక ఉన్న ప్రతి హేతువు ఆయనకు పూర్తిగా సమర్పణ కలిగియుండాలని ఆయన కోరుచున్నాడు. మన లోతైన ఆలోచనలు మరియు ఆశలలో నుండి ప్రవహించు నిజమైన విధేయతను ఆయన కోరుచున్నాడు.

విధేయత అనునది మంచి హేతువులలో నుండి ప్రవహించాలి అని ద్వితీ. 6:5-6, మరియు 30:2-17; యెహో. 22:5; 1 రాజులు 8:61; కీర్తనలు 119:34; మత్తయి 12:34-35; రోమా. 6:17-18; మరియు ఎఫెసీ. 6:5-6 వంటి అనేక లేఖన భాగములు బోధించుచున్నాయి. ఒక ఉదాహరణగా, పాత నిబంధనలోని ఒక వాక్యభాగమును మరియు క్రొత్త నిబంధనలోని ఒక వాక్యభాగమును చూద్దాము.

మొదటిగా, ద్వితీ. 6:5-6లోని ఈ మాటలను వినండి:

> నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను (ద్వితీ. 6:5-6).

ఈ వాక్యభాగములో మనము చూచుచున్నట్లు, పాత నిబంధనలో తన ప్రజలు తమ హృదయములతో ఆయనను ప్రేమించాలని దేవుడు కోరాడు. దేవుని ఆజ్ఞలు వారి హృదయముల మీద వ్రాయబడియుండవలెను, తద్వారా వారు ఆయనకు హృదయపూర్వకముగా విధేయత చూపగలరు.

క్రొత్త నిబంధనలో కూడా ఇదే వాస్తవమైయున్నది. ఉదాహరణకు, రోమా. 6:17-18లో వ్రాయబడిన ఈ మాటలను వినండి:

> మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము (రోమా. 6:17-18).

ఇక్కడ "హృదయపూర్వకముగా" అని అనువదించబడిన గ్రీకు వ్యక్తీకరణము *ఎక్ కర్డియస్.* మరింత అక్షరార్ధముగా, దీనిని "హృదయము నుండి బయటకు" అని కూడా అనువదించవచ్చు. ఇక్కడ పౌలు బోధించినట్లు, దేవుడు హృదయపూర్వకమైన విధేయతను కోరుచున్నాడు — హృదయములో నుండి ప్రవహించు విధేయత.

సత్క్రియలు హృదయములో నుండి చేయాలి కాబట్టి మంచి హేతువులు అవసరమైయున్నవి అని చూశాము కాబట్టి, నైతిక నిర్ణయములను తీసుకొనుటకు మంచి హేతువులను కలిగియుండాలి అనుటకు రెండవ కారణమును ఇప్పుడు చూడవలసియున్నది. వేషధారణను గూర్చి లేఖనము యొక్క బోధ.

## వేషధారణ

లేఖనములలో వేషధారణ అనేక రూపములలో వర్ణించబడింది, కాని ఇక్కడ మనము వేషధారణను నైతికత యొక్క అబద్ధ ప్రత్యేక్షతగా వర్ణించు విధానము మీద ఆసక్తి కలిగియున్నాము. మన బాహ్య ప్రవర్తన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని వాక్యమునకు అనుగుణంగా ఉన్నట్లు అనిపిస్తుందిగాని, మన హేతువులు ఆ విధంగా ఉండవు, మనము వేషధారణ చేయుచున్నాము, మరియు మన క్రియలు దేవుని సంతోషపరచవు.

మత్తయి 6:2-16లో యేసు యొక్క బోధలను వినండి:

> కావున నీవు ధర్మము చేయునప్పుడు, మనుష్యులవలన ఘనత నొందవలెనని, వేషధారులు సమాజమందిరములలోను వీధులలోను చేయులాగున నీ ముందర బూర ఊదింప వద్దు... మరియు మీరు ప్రార్థనచేయునప్పుడు వేషధారుల వలె ఉండవద్దు; మనుష్యులకు కనబడవలెనని సమాజమందిరములలోను వీధుల మూలలలోను నిలిచి ప్రార్థన చేయుట వారికిష్టము... మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై యుండకుడి; తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖము లను వికారము చేసికొందురు (మత్తయి 6:2-16).

అవసరతలో ఉన్నవారికి ఇచ్చుట, ప్రార్థించుట మరియు ఉపవాసముండుట వాటంతట అవే మంచి మరియు నైతిక ప్రవర్తనలే. కాని ఈ సందర్భములలో, యేసు వాటిని వేషధారణ అని ఖండించాడు, ఎందుకంటే అవి దేవుని పట్ల మరియు పొరుగువాని పట్ల ప్రేమ చూపుటకు బదులుగా అహంకారము ద్వారా పురికొల్పబడినవి. దుష్ట హేతువులను ఖండించుట ద్వారా, మంచి ప్రవర్తన ఎల్లప్పుడు మంచి హేతువులలో నుండి ప్రవహించాలి అని వేషధారణకు విరోధముగా బైబిలు బోధనలు సూచిస్తాయి.

ఇప్పుడు వేషధారణను నటించు అవిశ్వాసులకు మాత్రమే పరిమితము చేయకుండా మనమూ జాగ్రత్తపడాలి; క్రైస్తవులు కూడా తమ బాహ్య క్రియలతో పొంతనలేని హేతువులను కలిగియుండవచ్చు. లేఖనములో దీనికి అత్యంత స్పష్టమైన ఉదాహరణను, గలతీ సంఘములోని యూదా క్రైస్తవులు అన్య విశ్వాసులతో వ్యవహరించిన విధానములో చూడవచ్చు. క్రీస్తు మరణము మరియు పునరుత్థానము పాత నిబంధన నియమములను క్రొత్త విధానములలో అనువర్తించాలని కోరాయని ఎరిగియుండి ఈ యూదా క్రైస్తవులు అనేక పారంపరిక యూదుల అలవాట్లను ఆచరించుట మానివేశారు. అయినను, సంఘములో అన్యుల కంటే తమకు ఎక్కువ గౌరవమును ఇచ్చిన కొన్ని పాతగిలిన పరంపరలను వారు ఆచరించుట కొనసాగించారు.

ఆశ్చర్యకరముగా, అపొస్తలుడైన పేతురు మరియు మిషనరీ బర్నబా కూడా ఈ క్రైస్తవ వేషధారులలో భాగమైయున్నారు. అసలు అన్యులకు మొట్టమొదటిగా సువార్తను అందించినది పేతురు అను విషయమును (అపొ. 10లో మనము చదువునట్లు), మరియు బర్నబా అన్యజనుల మధ్యకు వెళ్లిన మొట్టమొదటి మిషనరీలలో ఒకరు (అపొ. 13లో మనము చదువునట్లు) అను విషయమును పరిగణించినప్పుడు, ఇది

ఎంతో ఆశ్చర్యమును కలిగిస్తుంది. గలతీ. 2:11-13లో ఈ సమస్యను గూర్చి పౌలు ఇచ్చిన కథనమును వినండి:

> అయితే కేఫా అంతియొకయకు వచ్చినప్పుడు అతడు అపరాధిగా తీర్చబడెను గనుక నేను ముఖాముఖిగా అతనిని ఎదిరించితిని; ఏలయనగా యాకోబు నొద్దనుండి కొందరు రాకమునుపు అతడు అన్యజనులతో భోజనముచేయుచుండెను గాని వారు రాగానే సున్నతి పొందిన వారికి భయపడి వెనుకతీసి వేరైపోయెను. తక్కిన యూదులును అతనితో కలిసి మాయవేషము వేసికొనిరి గనుక బర్నబా కూడ వారి వేషధారణముచేత మోస పోయెను (గలతీ. 2:11-13).

ఈ వేషధారణకు ప్రతిస్పందనగా, పౌలు పేతురును ముఖము మీద గద్దించాడు, మరియు స్వయంగా పేతురు యూదుని వలెగాక అన్యుని వలె జీవించిన విషయమును గుర్తుచేశాడు. క్రీస్తునందు అన్యులు యూదులతో సమానులు అని పేతురుకు తెలుసు. అయితే తన గౌరవమును కోల్పోవు భయముతో, అన్య క్రైస్తవులు యూదా క్రైస్తవుల కంటే తక్కువవారు అని సూచించు విధానములలో వ్యవహరించుటకు ఇష్టపడ్డాడు. పేతురు యొక్క క్రియలు వేషధారణ అయ్యున్నవి, ఎందుకంటే దేవునిని మరియు ఆయన సంఘమును గౌరవించు దైవికమైన ఆశకు భిన్నముగా తన సొంత ఖ్యాతిని భద్రపరచుకొను స్వార్థపు ఆశతో పురికొల్పబడ్డాడు.

సత్క్రియలు హృదయపూర్వకముగా చేయాలిగాని వేషధారణతో చేయకూడదు అని చూశాము కాబట్టి, మంచి హేతువులు కలిగియుండుటకు మూడవ కారణమును చూచుటకు ఇప్పుడు మనము సిద్ధముగా ఉన్నాము, అది, క్రీస్తు అనుచరులు కలిగియుండవలసిన సద్గుణము.

## సద్గుణము

సులువైన పదములలో, సద్గుణము అనగా కొనియాడదగిన నైతిక స్వభావము. కొనియాడదగిన నైతిక ప్రవర్తనలోని విభిన్నమైన కోణములను సూచిస్తూ, సద్గుణములను గూర్చి మనము బహువచనములో కూడా మాట్లాడవచ్చు, హేతువులను గూర్చి మనము చేయు చర్చలో సద్గుణము చాలా ప్రాముఖ్యమైయున్నది, ఎందుకంటే సద్గుణము గల ప్రవర్తన మంచి హేతువుల రూపములో వ్యక్తపరచబడుతుంది. లేఖనములో మనము సద్గుణములు అని పిలచు అనేక పట్టికలు ఉన్నాయి, కాని వీటిలో అత్యంత సుపరిచితమైనది ఆత్మ ఫలములను గూర్చి పౌలు ఇచ్చిన పట్టిక అయ్యున్నది.

గలతీ. 5:22-23లో, ఆత్మ ఫలమును పౌలు ఈ విధంగా వర్ణించాడు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము (గలతీ 5:22-23).

ఈ పట్టికలో అన్ని గుణములు లేవుగాని, దేవుడు తన ప్రజల నుండి ఆశించు నైతిక గుణములకు ఇది మంచి సారాంశమైయున్నది. ఈ సద్గుణములలో ప్రతిది మనలను నైతిక కార్యములు చేయుట వైపుకు నడిపించు అంతరంగ నిర్ణయమైయుండాలి. ఈ భావనలో సద్గుణములు హేతువులైయున్నవి.

ఉదాహరణకు, క్రైస్తవ ప్రేమ అను సద్గుణము ప్రేమించు విధానములలో కార్యము చేయునట్లు మనలను పురికొల్పుతుంది. అదే విధముగా, ఆత్మయందు ఆనందముగా ఉండువారు వారి ఆనందము ద్వారా పురికొల్పబడతారు. సమాధానముతో ఉండు ప్రజలు వారిలో ఉండు సమాధానము ద్వారా పురికొల్పబడతారు. సహనము గల ప్రజలు తమ సహనము ద్వారా పురికొల్పబడతారు. మత్తయి 12:35లో యేసు బోధించినట్టుగా:

> సజ్జనుడు తన మంచి ధననిధిలోనుండి సద్విషయములను తెచ్చును (మత్తయి 12:35).

ఈ పాఠములోని మిగిలిన భాగము అంతటిలో, మనము ప్రేమ మరియు విశ్వాసము అను సద్గుణముల మీద దృష్టిపెడదాము, ఎందుకంటే సత్క్రియలు చేయుటకు అవి అవసరమైయున్నవి అని బైబిలు చెబుతుంది. దీని కొరకు సిద్ధపాటుగా, ప్రేమ మరియు విశ్వాసము అను సద్గుణములు కలిగి లేకుండా, మరియు ఆ సద్గుణములు మన ప్రవర్తనను పురికొల్పకుండా, ఏది మంచిదిగా పరిగణించబడదు అను ఆలోచనను క్లుప్తంగా పరిగణిద్దాము. కొరింథులో ఉన్న సంఘముతో ప్రేమను గూర్చి పౌలు మాట్లాడిన విధానమును గూర్చి మొదటిగా ఆలోచించండి. 1 కొరింథీ. 13:1-3లో, అతడు ఈ మాటలను వ్రాశాడు:

> మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును. ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసముగలవాడనైనను, ప్రేమలేనివాడనైతే నేను వ్యర్థుడను. బీదలపోషణకొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేనివాడనైతే నాకు ప్రయోజనమేమియు లేదు (1 కొరింథీ. 13:1-3).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మన క్రియలు మన హృదయములలో ఉన్న ప్రేమలో నుండి ప్రవహించాలి అని ఈ వాక్యభాగము స్పష్టము చేస్తుంది. అనగా, మన క్రియలు మన హృదయములలో ఉన్న ప్రేమలో నుండి ప్రవహించకపోతే, వాటిని దేవుడు మంచివిగా పరిగణించడు.

ఇదే విధముగా, విశ్వాసము అను సద్గుణము కూడా ఒక హేతువుగా పనిచేయాలి అని హెబ్రీ. 11:6 బోధిస్తుంది. దానిలోని మాటలను వినండి:

> విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా (హెబ్రీ. 11:6).

ఈ వాక్యభాగము ప్రకారం, విశ్వాసము అను సద్గుణము నమ్మకమైన విధానములలో కార్యములు చేయునట్లు మనలను పురికొల్పాలి. అప్పుడు మాత్రమే దేవుడు మన ప్రవర్తన ద్వారా సంతోషించగలడు.

నైతికమైన జీవనము కొరకు హేతువులు చాలా ప్రాముఖ్యమైయున్నవి కాబట్టి, లేఖనములు క్రైస్తవ సద్గుణమును ఉద్ఘాటిస్తాయి. మరియు లేఖనము బోధించు ప్రతి సద్గుణము మనలో ఒక హేతువుగా పనిచేస్తుంది. కాబట్టి, లేఖనము క్రైస్తవ సద్గుణము యొక్క ప్రాముఖ్యతను ఉద్ఘాటించిన ప్రతిసారి, అది మంచి, సద్గుణములతో కూడిన హేతువుల యొక్క ప్రాముఖ్యతను కూడా ఉద్ఘాటిస్తుంది.

నైతిక నిర్ణయములను తీసుకొనునప్పుడు సరియైన హేతువులు కలిగియుండుట యొక్క ప్రాముఖ్యతను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, విశ్వాసము అను హేతువును ఇప్పుడు మనము మరింత వివరముగా చూచుటకు సిద్ధముగా ఉన్నాము. మనము విశ్వాసము ద్వారా పురికొల్పబడుట ఎందుకు అంత కీలకమైయున్నది? మరియు విశ్వాసము మనలను ఎలా పురికొల్పుతుంది?

## విశ్వాసము అను హేతువు

విశ్వాసము పాత మరియు క్రొత్త నిబంధనలు రెండిటికి కేంద్ర అంశము అయ్యున్నది అని బైబిలు ఎరిగియున్న ప్రతివ్యక్తి గుర్తిస్తాడు. మరియు విశ్వాసము అను అంశము పారంపరిక క్రైస్తవ వేదాంతశాస్త్రములో కూడా కేంద్ర స్థానమును కలిగియున్నది. నీతిశాస్త్రములో విశ్వాసము కేంద్ర హేతువుగా ఉన్నది అను విషయమును చూచుట పట్ల ఈ పాఠములో మనము ప్రత్యేకమైన ఆసక్తిని కలిగియున్నాము. దేవుని వాక్యమునకు విధేయత చూపునట్లు విశ్వాసము మనలను ఎలా పురికొల్పుతుంది అను విషయమును విశదీకరించాలని మనము కోరుచున్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

లేఖనము విశ్వాసమును గూర్చి ఎన్నో విషయములను చెబుతుంది కాబట్టి, విశ్వాసము హేతువుగా పని చేయు ప్రతి విధానమును ఇక్కడ ప్రస్తావించుట అసాధ్యమవుతుంది. కాబట్టి, మనము మన సంభాషణను నిర్ణయము-తీసుకొను ప్రక్రియలో విశ్వాసము అను హేతువు పనిచేయు మరింత సామాన్యమైన మరియు ప్రాథమికమైన విధానములకు మాత్రమే పరిమితము చేద్దాము. మొదటిగా, రక్షింపబడు విశ్వాసము హేతువుగా పనిచేయు విధానములను గూర్చి మాట్లాడదాము. రెండవదిగా, మారుమనస్సు అను హేతువు విశ్వాసము యొక్క ప్రాథమికమైన వ్యక్తీకరణ అయ్యున్నది అను విషయమును చర్చిద్దాము. మరియు మూడవదిగా, నిరీక్షణను గూర్చి భవిష్యత్తు వైపుకు నిర్దేశించబడిన విశ్వాసము అని చూద్దాము. రక్షింపబడు విశ్వాసము, అనగా బాహ్య రక్షణను తెచ్చు విశ్వాసము అను హేతువును చూస్తూ ఆరంభిద్దాము.

## రక్షింపబడు విశ్వాసము

ఈ పాఠములో మన ఉద్దేశ్యముల కొరకు, రక్షింపబడు విశ్వాసమును మనము ఈ విధముగా క్రోడీకరించవచ్చు.

> సువార్త సత్యమునకు సమ్మతి తెలుపుట, మరియు మన పాపము నుండి మనలను రక్షించుటకు క్రీస్తునందు నమ్మికయుంచుట.

అవును, రక్షింపబడు విశ్వాసమును గూర్చి ఇంకా ఎన్నో విషయములను చెప్పవచ్చు. అయితే విశ్వాసము సత్క్రియలకు హేతువుగా ఎలా పనిచేస్తుందో చూచుటలో ఈ నిర్వచనము సహాయపడుతుంది.

లేఖనము రక్షింపబడు విశ్వాసమును గూర్చి రెండు ప్రధానమైన మార్గములలో మాట్లాడుతుంది. ఒక వైపున, అది విశ్వాసము ఆరంభ రక్షణకు మాధ్యమము అయ్యున్నది అని చెబుతుంది. మరొకవైపున, ఇదే రక్షించు కృప మన క్రైస్తవ జీవితమంతటా కొనసాగు సమర్పణ అయ్యున్నది అని కూడా తెలియజేస్తుంది. రక్షింపబడు విశ్వాసము ఆరంభ రక్షణకు మాధ్యమమైయున్నది అను విషయమును చూస్తూ ఆరంభిద్దాము.

### ఆరంభ రక్షణకు మాధ్యమము

రక్షింపబడు విశ్వాసము ఆరంభ రక్షణకు మాధ్యమమైయున్నది అని మనము చెప్పునప్పుడు, ఇది రక్షణను మనకు అనువర్తించుటకు దేవుడు ఉపయోగించు ఒక పరికరము అయ్యున్నది అని మన అర్థము. మనము విశ్వాసమును ఇంటికి రంగు పూయుటకు పెయింటర్ ఉపయోగించు పెయింట్ బ్రష్ తో పోల్చవచ్చు. పెయింట్ బ్రష్ ఇంటికి రంగులు వేయబడుటకు యోగ్యమైనదానిగా చేయదు, అలాగే రక్షణ మనలను రక్షించబడుటకు యోగ్యులనుగా చేయదు. పెయింట్ బ్రష్ బకెట్ నుండి ఇంటి గోడ మీదికి పెయింట్ ను తీసుకొని వెళ్లుటకు పెయింటర్ ఉపయోగించు ఒక పరికరము మాత్రమే. ఇదే విధముగా, విశ్వాసము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పాపభరితమైన మానవులకు రక్షణను అనువర్తించుటకు దేవుడు ఉపయోగించు పరికరము అయ్యున్నది. మన విశ్వాసములో రక్షణను పొందుటకు అర్హమయ్యే లేక రక్షణను సంపాదించు ఏ యోగ్యత లేదు. భిన్నముగా, క్రీస్తు జీవితము మరియు మరణము రక్షణను సంపాదించింది, మరియు విశ్వాసము ద్వారా క్రీస్తు రక్షణను మనకు ఉచితముగా అనుగ్రహిస్తాడు.

రోమా. 5:1-2లో పౌలు మాటలను వినండి:

> కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము మరియు ఆయనద్వారా మనము విశ్వాసమువలన ఈ కృపయందు ప్రవేశముగలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమనుగూర్చిన నిరీక్షణనుబట్టి అతిశయపడుచున్నాము (రోమా. 5:1-2).

ఇక్కడ పౌలు మాట్లాడుచున్న దేవుడు పాపములను క్షమించి, మనలను నీతిమంతులుగా ప్రకటించుట నీతిమంతులుగా తీర్చబడుట, పౌలు మరియు అతని శ్రోతలు మొట్టమొదటిసారిగా రక్షింపబడు విశ్వాసములోనికి వచ్చినప్పుడు జరిగింది.

ఇట్టి నీతి మన రక్షణ యొక్క ఆరంభ స్థాయిలో జరుగుతుంది. ఇది దేవుడు మన పాపములను క్షమించి క్రీస్తు యొక్క యోగ్యతను మన ఖాతాలో జమచేయు దేవుని కృపగల కార్యము అయ్యున్నది. మరియు ఇది నిత్యము వరకు మన స్థితిని మార్చివేస్తుంది. నీతిమంతులుగా తీర్చబడుటకు ముందు, మనము పాపులము మరియు దేవుని విరోధులమైయుంటిమి. అయితే ఆయన మనలను రక్షించిన వెంటనే, మనము ఆయనకు ప్రియమైన పరిశుద్ధులమైపోతాము. మరియు మనలను నీతిమంతులుగా తీర్చుటకు దేవుడు ఉపయోగించు పరికరము రక్షింపబడు విశ్వాసము అయ్యున్నది.

మన ఆరంభ రక్షణ యొక్క నేపథ్యములో, రక్షింపబడు విశ్వాసము మన పాపముల నుండి మారుమనస్సుపొంది, రక్షణ కొరకు క్రీస్తును నమ్మునట్లు మనలను పురికొల్పుతుంది. ఈ సత్క్రియలు మన రక్షణకు మొట్టమొదటి ఆధారములైయున్నవి, ఎందుకంటే అవి నిజమైన రక్షింపబడు విశ్వాసము ద్వారా మాత్రమే పురికొల్పబడతాయి.

మన ఆరంభ రక్షణకు రక్షింపబడు విశ్వాసము మాధ్యమమైయున్నది అని సెలవిచ్చుటతో పాటుగా, రక్షింపబడు విశ్వాసము క్రీస్తు పట్ల మన కొనసాగు సమర్పణ అయ్యున్నది అని కూడా బైబిలు మాట్లాడుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## కొనసాగు సమర్పణ

కొనసాగు సమర్పణగా, రక్షింపబడు విశ్వాసములో సువార్తలోని సత్యమునకు సమ్మతి తెలుపుట, మరియు మనలను మన పాపము నుండి రక్షించుట కొరకు క్రీస్తునందు కొనసాగు విశ్వాసమును ఉంచుట కూడా భాగమైయున్నాయి. ఇది మన ఆరంభ రక్షణకు మాధ్యమమైన అదే విశ్వాసమును స్థిరముగా కలిగియుండుట అయ్యున్నది. మరియు ఇట్టి సమ్మతి మరియు నమ్మకము మనము నమ్ము ప్రతి విషయమును ప్రభావితము చేయవచ్చు. అవి మనలను గూర్చి, మన కుటుంబమును గూర్చి, మన ఉద్యోగములను గూర్చి, మన సమాజములను గూర్చి, మరియు మన జీవితములలోని ఇతర విషయములన్నిటిని గూర్చి మనము ఆలోచించు విధానమును ప్రభావితము చేస్తుంది. ఈ భావనలో, రక్షింపబడు విశ్వాసము మన హృదయములలో నిలకడగా ఉండు మరియు మన నిర్ణయములన్నిటిని ప్రభావితము చేయు ఒక సంగ్రహ ప్రపంచ దృష్టికోణము అయ్యున్నది. ఇది మన సత్క్రియలకు ఆధారముగా ఉండి వాటిని పురికొల్పు క్రియాశీల విశ్వాసమైయున్నది.

ఇప్పుడు, విశ్వాసము కేవలం ఒక మానసిక కార్యము మాత్రమే అని ఆలోచించకుండా మనము జాగ్రత్తవహించాలి. ఇది యేసు ప్రభువు అని, మనము సువార్త ద్వారా రక్షణ పొందితిమి అని గుర్తించుట మాత్రమే కాదు. యాకోబు 2:19 సూచించుచున్నట్లు, దయ్యములు కూడా దేవుని గూర్చిన వాస్తవములను మానసికముగా గుర్తిస్తాయి, కాని ఇది వాటిని రక్షించలేదు.

బదులుగా, రక్షింపబడు విశ్వాసములో మన హృదయములు కూడా పాలుపంచుకుంటాయి. ఇది మనము దేవుని సంతోషపరచునట్లు ఆలోచించునట్లు, మాట్లాడునట్లు మరియు కార్యములుచేయునట్లు చేయు అంతరంగ నిర్ణయము అయ్యున్నది. కాబట్టి, అవును రక్షింపబడు విశ్వాసములో మానసిక క్రియలు కూడా భాగమైయున్నాయి. కాని మన విశ్వాసము నిజాయితీగలదైనప్పుడు, అట్టి మానసిక క్రియలు మన హృదయములలో నుండి ప్రవహిస్తాయి. ఈ విధముగా, రక్షింపబడు విశ్వాసము ప్రతి విశ్వాసి జీవితములో ఒక హేతువుగా పనిచేసి, సత్క్రియలను చేయుటకు మనలను బలపరుస్తుంది మరియు పురికొల్పుతుంది. ఉదాహరణకు, ఆది. 15:6 అబ్రాహాము యొక్క విశ్వాసమును గూర్చి మాట్లాడు విధానమును వినండి:

> **అతడు యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను (ఆది. 15:6).**

ఈ వచనము దేవుడు అబ్రాహాముతో మొట్టమొదటిగా నిబంధన చేసిన సమయమును వర్ణిస్తుంది, మరియు ఇది సాంప్రదాయికముగా రక్షించు లేక నీతిమంతులుగా తీర్చు విశ్వాసమునకు నిర్వచనమును అందించుటకు ఉపయోగించబడింది. "నమ్ముట" అను హెబ్రీ పదము "విశ్వాసము" అను హెబ్రీ పదము యొక్క అదే మూలము నుండి వెలువడుతుంది అని తెలుసుకొనుట దీనిని అర్థము చేసుకొనుటలో సహాయపడుతుంది. అలాగే నీతిమంతునిగా తీర్చబడుట అనగా నీతిమంతునిగా ప్రకటించబడుట



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అయ్యున్నది అని గుర్తుంచుకొనుట కూడా సహాయకరముగా ఉంటుంది. కాబట్టి, అబ్రాహాము అతని విశ్వాసము ద్వారా రక్షించబడ్డాడు, లేక నీతిమంతునిగా తీర్చబడ్డాడు అని ఈ వచనము బోధిస్తుంది.

ఇందుమూలముగానే, విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడు సిద్ధాంతమును రుజువు చేయుటకు అపొస్తలుడైన పౌలు ఆది. 15:6ను ఉపయోగిస్తాడు. అతడు రోమా. 4 మరియు గలతీ. 3లో రెండుసార్లు ఇలా చేశాడు. మరియు ప్రతి చోట అతడు అబ్రాహాము యొక్క ఉదాహరణను ఆధారముగా చేసుకొను స్పష్టమైన వాదములను చేశాడు, మరియు విశ్వాసము ద్వారా అబ్రాహాము యొక్క రక్షణ క్రీస్తునందు ప్రతి విశ్వాసికి ఒక మాదిరి అయ్యున్నది అని వివరించాడు. మరియు పౌలు బాటను అనుసరిస్తూ, నీతిమంతులుగా తీర్చబడుటకు విశ్వాసము మాత్రమే సరిపడు మాధ్యమమైయున్నది అని రుజువు చేయుటకు అబ్రాహాము ఉదాహరణను ఉపయోగిస్తారు. ఈ వాదన సంపూర్ణముగా వాస్తవముగాను, ఖచ్చితముగాను ఉన్నప్పటికీ, దీనిని మనము మరొక అడుగు ముందుకు తీసుకొని వెళ్లవచ్చు.

వాస్తవమేమిటంటే ఆది. 15లో దేవుడు అబ్రాహాముతో నిబంధనను చేయుటకు చాలా కాలం క్రితమే అబ్రాహాము రక్షింపబడు విశ్వాసమును కలిగియుండెను. హెబ్రీ. 11:8 మరియు ఆది. 12:4 ప్రకారం, హారానును విడచి వాగ్దాన భూమికి ప్రయాణము చేయుటకు ముందు అబ్రాహాము విశ్వాసముతో పని చేశాడు — ఆది. 15లో నమోదు చేయబడిన నీతికి చాలా కాలం క్రితమే.

ఆది. 15లో నమోదు చేయబడిన నిబంధన వేడుక అబ్రాహాము వాగ్దాన దేశములోనికి ప్రవేశించిన తరువాత, అతడు విశ్వసించిన తరువాత చాలా సంవత్సరములకు జరిగింది. స్పష్టముగా ఉండుటకు, ఆ సమయమందు అబ్రాహాము యొక్క విశ్వాసము రక్షించు, నీతిమంతునిగా తీర్చు విశ్వాసమైయుండినది. కాని అది క్రొత్త విశ్వాసమేమి కాదు. ఇది విశ్వాసిగా అతని జీవిత కాలమంతా అబ్రాహాము కలిగియుండిన అదే విశ్వాసమైయున్నది. కాబట్టి, మనకు మాదిరిని అందించుటకు పౌలు ఈ సన్నివేశమును ఉపయోగించినప్పుడు, మన ఆరంభ రక్షణ విశ్వాసము ద్వారా జరుగుతుంది అను వాస్తవమును మాత్రమే అతడు సూచించుటలేదు. అబ్రాహాము వలె ప్రతి విశ్వాసి కొనసాగు సమర్పణగా రక్షింపబడు విశ్వాసమును కలిగియుండాలి అని కూడా అతడు చెబుతున్నాడు. గలతీ 2:26లో పౌలు ఈ విధంగా వ్రాస్తున్నాడు:

> నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను (గలతీ. 2:20).

రచయిత పాత నిబంధనను వ్యాఖ్యానిస్తూ, దానిని ఆదిమ సంఘమునకు అనుబంధపరచిన హెబ్రీ. 10:38-39ని వినండి:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> నా యెదుట నీతిమంతుడైనవాడు విశ్వాసమూలముగా జీవించును గాని అతడు వెనుకతీసినయెడల అతనియందు నా ఆత్మకు సంతోషముండదు. అయితే మనము నశించుటకు వెనుకతీయువారము కాము గాని ఆత్మను రక్షించుకొనుటకు విశ్వాసము కలిగినవారమై యున్నాము (హెబ్రీ. 10:38-39).

విశ్వాసము కలిగి రక్షించబడినవారు — అనగా, రక్షింపబడు విశ్వాసము ఉన్నవారు — వెనుకతీయరు మరియు నాశనమవరు. వారు విశ్వాసములో నిలకడగా కొనసాగుతారు.

నిజమైన రక్షింపబడు విశ్వాసము మన జీవితమంతటిలో మనలను నడిపిస్తుంది. కాబట్టి, మన విశ్వాసము మనలో నిలకడగా ఉండని యెడల, అది ఏనాడు నిజమైన రక్షింపబడు విశ్వాసము కానేరదు. అంతేగాక, నిజమైన రక్షింపబడు విశ్వాసము సత్క్రియలు చేయునట్లు మనలను పురికొల్పుతుంది. కాబట్టి, మనము సత్క్రియలు చేయుటకు పురికొల్పబడకపోతే, మన విశ్వాసము నకిలీది అని అర్థము; అది మనలను రక్షించలేని అబద్ధ విశ్వాసమవుతుంది. 2:17-18లో యాకోబు వ్రాసినట్లు:

> ఆలాగే విశ్వాసము క్రియలులేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును... నేను నా క్రియలచేత నా విశ్వాసము నీకు కనుపరతునని (యాకోబు 2:17-18).

రక్షింపబడు విశ్వాసము ఎల్లప్పుడు మన క్రైస్తవ జీవితము అంతటిలో సత్క్రియల ద్వారా బయలుపరచబడుతుంది.

హెబ్రీ. 11ను పరిగణించండి, దీనిని కొన్నిసార్లు "హాల్ ఆఫ్ ఫెయిత్" అని పిలుస్తారు. ఈ అధ్యాయము పాత నిబంధనలోని అనేకమంది విశ్వాసుల యొక్క కొనసాగు రక్షింపబడు విశ్వాసమును క్రోడీకరించి, మన సొంత విశ్వాసము కొరకు వారిని మాదిరిగా చూపుతుంది. ఈ ప్రజలందరు తాము మొదటిగా విశ్వాసములోనికి వచ్చినప్పుడు మాత్రమేగాక వారి జీవితకాలమంతటా విశ్వాసము ద్వారా జీవించారు అని హెబ్రీ. 11 ఉద్ఘాటిస్తుంది. మరింత ఖచ్చితముగా మాట్లాడితే, వారు చేసిన అనేక సత్క్రియలు వారి కొనసాగు విశ్వాసము ద్వారా పురికొల్పబడినవి.

ఉదాహరణకు, హేబెలు యొక్క రక్షింపబడు విశ్వాసము అతడు దేవునికి ఇష్టానుసారమైన బలులను అర్పించుటకు అతన్ని పురికొల్పింది అని హెబ్రీ. 11:4 నుండి మనము నేర్చుకుంటాము. దేవునికి తనకు నచ్చిన బలిని కోరు హక్కు ఉన్నది అను సత్యమునకు హేబెలు సమ్మతించాడు, మరియు అతడు దేవుని చిత్తమునకు విధేయత చూపిన యెడల దేవుడు అతనిని దీవిస్తాడు అని హేబెలు నమ్మాడు. మరియు అతని విశ్వాసము కారణంగా, తనకు అత్యంత అమూల్యమైన వస్తువులను కూడా అర్పించుటకు హేబెలు ఇష్టపడ్డాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నోవహు యొక్క రక్షింపబడు విశ్వాసము అతనిని ఓడ నిర్మించుటకు, మరియు అతడు లోకములో చూసిన పాపమునకు విరోధముగా ప్రకటించుటకు పురికొల్పింది అని హెబ్రీ. 11:7లో మనకు తెలుపబడినది. అతనిని మరియు అతని కుటుంబమును జలప్రళయం నుండి రక్షించుటకు దేవుడు ఆ ఓడను ఉపయోగించుకుంటాడు అను సత్యమునకు నోవహు సమ్మతించాడు, మరియు ఈ విధముగా అతనిని విమోచించుట కొరకు అతడు దేవుని నమ్మాడు. ఇట్టి విశ్వాసము అత్యంత కఠినమైన ఓడ నిర్మాణమును చేపట్టుటకు, మరియు తన చుట్టూ ఉన్నవారికి సువార్తను ప్రకటించుటకు నోవహును పురికొల్పింది. దేవుడు నిజముగా మాట్లాడాడు అని మరియు అతని పొరుగువారు విశ్వాసముతో దేవుని తట్టు తిరిగితే వారిని కూడా ఆయన విడిపిస్తాడు అనే నిశ్చయతతో అతడు తన పొరుగువారు చేసిన హేళనను కూడా సహించాడు.

అబ్రాహాము యొక్క రక్షింపబడు విశ్వాసము అతడు దేవుని ఆజ్ఞకు విధేయత చూపి తన కుమారుడైన ఇస్సాకును బలి ఇచ్చుటకు సిద్ధము చేసింది అని హెబ్రీ. 11:17-19లో మనము నేర్చుకుంటాము. ఇస్సాకు యొక్క మరణమును కోరుటకు దేవునికున్న హక్కుతో అబ్రాహాము సమ్మతించాడు, మరియు ఈ కార్యము ద్వారా దేవుడు తనను మరియు ఇస్సాకును దీవిస్తాడు అని అతడు నమ్మాడు. దేవుడు ఇస్సాకును మరణము నుండి కూడా తిరిగిలేప సమర్థుడు అని నమ్మునంత గొప్ప విశ్వాసము అతడు కలిగియుండెను. మరియు దేవుడు తన మహా కనికరములో తుదకు ఇస్సాకు మరణమునకు అనుమతి ఇయ్యక అబ్రాహాము యొక్క విశ్వాసమును అంగీకరించాడు.

మోషే ఫరో కుటుంబములో సభ్యునిగా జీవితమును ఆస్వాదించుటకు అవకాశము ఉన్నను, అతడు తనను తాను ఇశ్రాయేలీయ బానిసలతో గుర్తించుకొనుటకు అతని విశ్వాసము పురికొల్పింది అని హెబ్రీ. 11:25లో మనము చూస్తాము. మోషే ఒక సౌకర్యవంతమైన మరియు అధికారముగల జీవితమును విడిచిపెట్టాడు, ఎందుకంటే నిజమైన ఆశీర్వాదములన్నీ దేవుని యొద్ద నుండి కలుగుతాయను సత్యమునకు అతడు సమ్మతించాడు. మరియు దేవుడు ఇశ్రాయేలును బానిసత్వము నుండి విడిపిస్తాడు అని అతడు నమ్మాడు కాబట్టి హృదయపూర్వకముగా బానిస దేశమైన ఇశ్రాయేలుతో చేరాడు.

ఇంతేగాక, పాత నిబంధన పరిశుద్ధుల యొక్క విశ్వాసము వారు రాజ్యములు జయించునట్లు, న్యాయము తీర్చునట్లు, తమ జీవితములకు కలిగిన హానిని అధిగమించునట్లు, యుద్ధములో జయమును పొందునట్లు, హింసను సహించునట్లు, మరణమును ధైర్యముగా ఎదుర్కొనునట్లు, మరియు అనేక ఇతర రకములైన హింసలను, అపాయములను ఓర్చుకొనునట్లు వారిని పురికొల్పింది అని 33-38 వచనములలో మనము చదువుతాము. వారి పట్ల దేవుని మంచితనము మీద వారికి నిశ్చయత ఉండెను గనుక, మరియు తమ రక్షకునిగా వారు ఆయనను నమ్మిరి గనుక వారు సహించగలిగారు మరియు జయము పొందారు. ఈ సమ్మతి మరియు నమ్మకము తమ జీవితములలో మిగిలినవాటన్నిటి కంటే ఎక్కువగా దేవుని సంతోషమును ఆశించుటకు మరియు వెదకుటకు వారిని బలపరచాయి.

మరియు ఇదే నేడు మనకు కూడా వర్తిస్తుంది. మనము మన జీవితకాలమంతా విశ్వాసములో నిలకడగా ఉండాలి. దేవుడు తన వాక్యమందు ప్రకటించిన సత్యములకు మనము స్థిరముగా సమ్మతించాలి, మరియు మనము నిజాయితీగా ఆయన ఆశీర్వాదములు మరియు రక్షణను నమ్మాలి.

మునుపటి పాఠములలో మనము చూసినట్లు, రక్షింపబడు విశ్వాసములేనివారు — అనగా, ఈ లోకములోని అవిశ్వాసులు — దేవుని సత్యమును తిరస్కరించి ఆయనను నమ్ముటకు నిరాకరిస్తారు. వారు పాపమునకు బానిసలైరి కాబట్టి, వారు దేవుని మంచితనమును మరియు సార్వభౌమత్వమును తిరస్కరిస్తారు, ఆయన అందించు రక్షణను నేలపాలు చేస్తారు, మరియు వారు కేవలం పాపము ద్వారా పురికొల్పబడతారు.

అయితే దేవుడు చెప్పు మాటలను మనము నమ్మి అన్ని విధములుగా ఆయనను విశ్వసించినప్పుడు, ఆనందము మరియు నెరవేర్పు ఆయనలో మాత్రమే కలుగుతుంది అని మనము గుర్తించవలసియుంటుంది. ఆయన చిత్తమునకు విధేయత చూపుట ఈ ఆశీర్వాదములకు మార్గమైయున్నది అని మనము చూడాలి. మరియు ఈ విధంగా, మన విశ్వాసము మనలను సత్క్రియలు చేయుట కొరకు కూడా పురికొల్పాలి.

రక్షింపబడు విశ్వాసమును గూర్చిన ఈ అవగాహనను మనస్సులో ఉంచుకొని, క్రైస్తవ జీవితములో విశ్వాసము అను హేతువు కార్యము చేయుటకు రెండవ మార్గము మారుమనస్సు అని చర్చించుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## మారుమనస్సు

బైబిలులో మారుమనస్సు విశ్వాసము యొక్క హృదయపూర్వక కోణము అయ్యున్నది మరియు ఇలా చేయుట ద్వారా మనము నిజాయితీగా పాపమును తిరస్కరించి, దాని నుండి వెనుదిరుగుతాము. ఇది మనము పాపులమని ఒప్పుకొనుట మరియు నమ్ముట కంటే, మన పాపములను బట్టి పశ్చాత్తాపపడుట కంటే కూడా గొప్పది. అవును, మారుమనస్సులో ఈ విషయములు కూడా ఉంటాయి. అయితే మనము నిజముగా మన పాపముల నుండి మళ్లితే తప్ప, మనము నిజముగా మారుమనస్సు పొందినవారము కాము.

లేఖనములో పశ్చాత్తాపము మరియు విశ్వాసము అనునవి చాలాసార్లు ఒక నాణెము యొక్క రెండు వైపులు అయ్యున్నవి. విశ్వాసము అనగా క్రీస్తు వైపుకు తిరుగుట, మరియు మారుమనస్సు అనగా పాపము నుండి తిరుగుట. మరియు ఈ రెండు మలుపులు ఒకే చలనమును కలిగియున్నవి. వీటి మధ్య ఉన్న ముఖ్యమైన తేడా ఏమిటంటే, విశ్వాసము అనునది మనము హత్తుకొనుటకు ఆరంభించినదాని దృష్టికోణము నుండి వర్ణించబడుతుంది, మరియు మారుమనస్సు మనము వెనుక విడిచిపెట్టుదాని దృష్టికోణము నుండి

వర్ణించబడుతుంది. ఈ ప్రక్రియలో, మన మారుమనస్సు క్రియలు మన మారుమనస్సు భావనల ద్వారా పురికొల్పబడతాయి — అవి మన సహనము, మన అనుతాపము. మరియు ఈ భావనలు విశ్వాస వ్యక్తీకరణములైయున్నవి. విశ్వాసము ద్వారా మనము మారుమనస్సు సువార్తలో కీలకమైన భాగమైయున్నది అని సమ్మతిస్తాము, మరియు విశ్వాసము ద్వారా మనము మారుమనస్సుపొందినప్పుడు దేవుడు క్షమిస్తాడు అని మనము నమ్ముతాము.

ఉదాహరణకు, అపొ. 10లో నమోదు చేయబడిన అన్యుడైన కొర్నేలీ యొక్క మారుమనస్సును పరిగణించండి. ఆ సన్నివేశములో కొర్నేలీకి మరియు అతని కుటుంబమునకు సువార్తను ప్రకటించుటకు పేతురు పంపబడ్డాడు. మరియు అతడు మాట్లాడుచుండగా, పరిశుద్ధాత్మ ఆ కుటుంబము మీదికి వచ్చి వారు రక్షింపబడు విశ్వాసమును కలిగియున్నారు అని రుజువు చేసింది. తరువాత అపొ. 11లో. పేతురు ఈ సన్నివేశమును యెరూషలేములో ఉన్న సంఘము ఎదుట నివేదించాడు. మరియు సంఘము యొక్క స్పందన మారుమనస్సు మరియు విశ్వాసమును బలముగా సమానపరచింది. అపొ. 11:8లో సంఘము యొక్క స్పందనను వినండి:

> [సంఘము] ఈ మాటలు విని మరేమి అడ్డము చెప్పక–అట్లయితే అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయచేసియున్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి (అపొ. 11:18).

కొర్నేలీ యొక్క మారుమనస్సు నిజమైన పశ్చాత్తాప భావనల ద్వారా పురికొల్పబడింది. వాస్తవానికి, రక్షింపబడు విశ్వాసము మరియు మారుమనస్సుకు మధ్య ఉన్న సంబంధము ఎంత బలమైనది అంటే, సంఘము యొక్క మనస్సులో, మారుమనస్సును పశ్చాత్తాపము అను పదముతో క్రోడీకరించవచ్చు.

ఇదే విధముగా, బాప్తిస్మమిచ్చు యోహాను మారుమనస్సు అను హేతువును విశ్వాసము అను హేతువుతో సమానము చేశాడు. పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు బాప్తిస్మము పొందుటకు అతని యొద్దకు వచ్చినప్పుడు, మారుమనస్సుకు అనుగుణమైన సత్క్రియలను చేయమని యోహాను వారికి ఉపదేశించాడు. మత్తయి 3:8లో ఈ మాటలను ఉపయోగించి యోహాను వారిని ఉపదేశించాడు:

> మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి (మత్తయి 3:8).

యోహాను యొక్క మారుమనస్సు బాప్తిస్మము జీవితకాల పరిణామాలను కలిగియుండుటకు ఉద్దేశించబడినది. ప్రజలు తమ పాపముల నుండి వెనుదిరిగి, ఆ సమయము నుండి మంచితనమును హత్తుకొనుటకు ఉద్దేశించబడినది. యోహాను మనస్సులో, నిజమైన మారుమనస్సు సత్క్రియలను పురికొల్పింది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు అపొస్తలుడైన పౌలు కూడా ఇదే నియమమును బోధించాడు. అతడు చెరసాలలో ఎందుకు ఉన్నాడో వివరించుటకు రాజైన అగ్రిప్ప ముందు నిలబడినప్పుడు, పౌలు సువార్తను మారుమనస్సు మరియు సత్క్రియల దృష్ట్యా క్రోడీకరించాడు. అపొ. 26:20లో అతని మాటలను వినండి:

> వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటిని (అపొ. 26:20).

మరొకసారి, మారుమనస్సు మరియు దేవుని వైపుకు తిరుగుట అనునవి ఒకే నాణెము యొక్క రెండు వైపులుగా ప్రస్తావించబడినవి. మన హృదయములు నిజముగా మారుమనస్సుపొందినప్పుడు, మన మారుమనస్సు మనలను పాపము నుండి వెనుదిరిగి, దేవుడు ఆమోదించు విధానములలో జీవించుటకు మనలను పురికొల్పుతుంది.

లేఖనములో మారుమనస్సుకు ఎన్నో గొప్ప ఉదాహరణలు ఉన్నాయి. ఉదాహరణకు, లూకా 19:8లో సుంకపుగుత్తదారుడైన జక్కయ్య యొక్క మారుమనస్సును గూర్చి నమోదు చేయబడింది. అతడు క్రీస్తును విశ్వసించినప్పుడు, ప్రజలను మోసము చేయుట మానివేశాడు, తన ఆస్తిలో సగ భాగమును పేదలకు ఇచ్చాడు, మరియు ప్రజలు నుండి దోచుకొనిన సొమ్మును నాలుగింతలు తిరిగి ఇచ్చాడు. అతడు దొంగతనము అను పాపమును విడిచిపెట్టాడు, మరియు విశ్వాసము మరియు సత్క్రియలలో కొనసాగు జీవితమును హత్తుకున్నాడు.

మరియు అపొస్తలుడైన పౌలు మారుమనస్సుపొందినప్పుడు, అతడు సంఘమునకు విరోధముగా చేసిన పాపములను ఒప్పుకున్నాడు, మరియు బలమైన సువార్తికునిగా మారి, సువార్తను ప్రకటించుటకు తన జీవితమును పణంగా పెట్టి, ఇంతకు ముందు అతడు హింసించినవారితో వినయముగా సహవాసమును వెదికాడు అని అపొ. 9 నమోదు చేస్తుంది. అతడు సంఘమును హింసించు పాపము నుండి వెనుదిరిగి, క్రీస్తునకు నమ్మకమైన సేవ చేయు జీవితమును హత్తుకున్నాడు.

మరియు 2 సమూయేలు 12లో నాతాను ప్రవక్త అతనిని నిలదీసిన తరువాత దావీదు యొక్క మారుమనస్సును గూర్చి చదువుతాము. దావీదు బత్షెబతో పాపము చేసి, తన పాపమును కప్పిపుచ్చుటకు ఆమె భర్త అయిన ఊరియా యొక్క హత్యకు ఏర్పాట్లు చేశాడు. అయితే దావీదు తన పాపమును ఒప్పుకొని, గొప్ప అనుతాపమును చూపి ఆ పాపము నుండి వెనుదిరిగాడు. మరియు దేవుని చిత్తమునకు అనుగుణంగా జీవించుటను ఆరంభించుట ద్వారా, ముఖ్యముగా తాను పొందిన క్షమాపణ కొరకు దేవుని స్తుతిస్తూ, ఇతరులను కూడా మారుమనస్సు పొందమని బోధిస్తూ అతడు విశ్వాసము వైపుకు తిరిగాడు. బైబిలులో పశ్చాత్తాపమును గూర్చి మాట్లాడు అతి గొప్ప కీర్తన అయిన 51వ కీర్తనలో అతడు మారుమనస్సును ఒక జ్ఞాపికగా వ్రాశాడు. కీర్తనలు 51:12-14లో దావీదు ఏమని వ్రాస్తున్నాడో గమనించండి:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము, సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము. అప్పుడు అతిక్రమము చేయువారికి నీ త్రోవలను బోధించెదను, పాపులును నీతట్టు తిరుగుదురు. దేవా, నా రక్షణకర్తయగు దేవా, రక్తాపరాధమునుండి నన్ను విడిపింపుము; అప్పుడు నా నాలుక నీ నీతినిగూర్చి ఉత్సాహగానము చేయును (కీర్తనలు 51:12-14).

దావీదు జీవితములో, మారుమనస్సు అతనిని ఆనందించుటకు, హృదయపూర్వకముగా దేవునికి విధేయత చూపుటకు, ఇతరులకు దేవుని వాక్యమును ప్రకటించుటకు, మరియు దేవునికి స్తుతులు పాడుటకు పురికొల్పింది.

దావీదు యొక్క మారుమనస్సు ఉదాహరణ క్రైస్తవులకు మరి ఎక్కువ ప్రాముఖ్యమైయున్నది, ఎందుకంటే దావీదు పాపము చేయుటకు ముందు ఒక బలమైన విశ్వాసి మరియు విశ్వాసమునకు మాదిరి అయ్యున్నాడు. దావీదు పాపము చేయుటకు ముందు, తన జీవితకాలమంతా అతడు దేవునియందలి విశ్వాసమును మరలా మరలా వ్యక్తపరిచాడు. మరియు దావీదును ఒక ధీనమైన కాపరి నుండి బలమైన యోధునిగా మరియు ఇశ్రాయేలు దేశమునకు రాజుగా చేయుట ద్వారా దేవుడు అతనిని దీవించాడు. అయితే దావీదు దేవుని కటాక్షమును బహుగా పొందుతున్న సమయములో, అతని విశ్వాసము మరలా మరలా రుజువుచేయబడిన తరువాత, దావీదు ఘోరమైన పాపములో పడిపోయాడు. అతడు ఒక వ్యభిచారి మరియు హంతకుడు అయిపోయాడు. మరియు ఆధునిక విశ్వాసులు కూడా ఇంతే ఘోరమైన పాపములలో పడిపోతారు. *వెస్ట్మి నిస్టర్ షార్టర్ కేటకిజం* యొక్క 82వ ప్రశ్నోత్తరము ఈ బైబిలు బోధను చక్కగా క్రోడీకరిస్తుంది. ఈ క్రింది ప్రశ్నకు జవాబుగా:

> దేవుని ఆజ్ఞలను పరిపూర్ణముగా పాటించుటకు సమర్థుడైన మనుష్యుడు కలడా?

దీనికి *కేటకిజం* ఇచ్చిన జవాబు:

> పతనము తరువాత ఏ నరమాత్రుడు కూడా దేవుని ఆజ్ఞలను పరిపూర్ణముగా పాటించు సామర్థ్యత కలిగిలేడుగాని, అనుదినము ఆలోచనలో, మాటలో, మరియు క్రియలలో వాటిని ఉల్లంఘించుచుంటాడు.

మనము అనుదినము పాపములో పడిపోతాము. అనగా మనము అనుదినము పశ్చాత్తాపపడవలసిన బాధ్యత మరియు అవకాశమును కలిగియున్నామని అర్థము.

1517 సంవత్సరములో, జర్మన్ వేదాంతవేత్త అయిన మార్టిన్ లూథర్ విట్టెన్బెర్గ్ లో ఉన్న సంఘ భవనము యొక్క తలుపు మీద తన *నైంటి ఫైవ్ థీసెస్* ను వ్రేలాడదీయుట ద్వారా నిరుద్దేశముగా ప్రొటెస్టెంట్



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సంస్కరణను ఆరంభించాడు అని మీకు తెలిసియుండవచ్చు. అయితే ఈ థీసెస్ లో మొదటిది ఏమిటో మీకు తెలుసా? అది చాలా సులువైనది:

> మన ప్రభువును రక్షకుడైన యేసు క్రీస్తు "మారుమనస్సు పొందుము" అని చెప్పినప్పుడు, విశ్వాసి జీవితము అంతా కూడా ఒక పశ్చాత్తాపముతో కూడిన జీవితముగా ఉండాలని ఆయన కోరాడు.

క్రైస్తవ జీవితము విశ్వాసముతో కూడిన జీవితము కాబట్టి, అది పశ్చాత్తాపముతో కూడిన జీవితము కూడా అయ్యుండాలి. దేవుని వాగ్దానములను నమ్ముట ద్వారా మనము ముందుకు కొనసాగుచుండగా, మనము మరలా మరలా వెనుదిరిగి చూస్తాము. మరియు మనము దేవుని మరియు ఇతరులను నొచ్చిన విధానములను చూసినప్పుడు, వారి యొద్ద నుండి క్షమాపణను కోరి, భవిష్యత్తులో భిన్నముగా స్పందించునట్లు మారుమనస్సు మనలను పురికొల్పుతుంది. ఆచరణాత్మకముగా మాట్లాడితే, కొన్నిసార్లు మన పాపములను గుర్తించి, వాటిని ఒప్పుకొనుట అసౌకర్యముగా ఉంటుంది. కాని మనము దేవుని క్షమాపణను మరియు రక్షణను నమ్మినప్పుడు, ఆయనను సంతోషపెట్టుటకు ఆశించినప్పుడు, అది మనలను మనము నమ్రపరచుకొనునట్లు, మన పాపములను విడిచిపెట్టునట్లు, దేవుని రాజ్యములో ఉండు నీతిని వెదకునట్లు మనలను పురికొల్పుతుంది.

రక్షించు విశ్వాసము మరియు మారుమనస్సును పరిగణించాము కాబట్టి, ఇప్పుడు విశ్వాసము అను హేతువులో మూడవ విషముగా నిరీక్షణను గూర్చి చర్చించుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## నిరీక్షణ

బైబిలు నిరీక్షణను గూర్చి అనేక విధాలుగా మాట్లాడుతుంది. అయితే మన ఉద్దేశ్యముల కొరకు అది నిరీక్షణను క్రీస్తునందు మన రక్షణలోని భవిష్యత్ కోణముల వైపుకు విశ్వాసమును నిర్దేశించునదిగా వర్ణించు సమయములను గూర్చి ఆలోచించుట సహాయకరముగా ఉంటుంది.

రక్షణ ఈ జీవిత కాలములో పూర్తి కాదు అని లేఖనము బోధిస్తుంది. మనము నీతిమంతులుగా తీర్చబడితిమి, మరియు మనము పరిశుద్ధాత్మను పొందియున్నాము. కాని మనము ఇంకా పరిపూర్ణులుగా చేయబడలేదు. మనము ఇప్పటికీ పాపముతో పోరాడుతుంటాము. ఇప్పటికీ మనము మరణము మరియు రోగముతో బాధపడుతుంటాము, మరియు లోకములో ఉన్న అనేక సమస్యలు మరియు భ్రష్టత్వములతో సతమతమవుతుంటాము. మనము మరణించి పరలోకమునకు వెళ్లినప్పుడు, ఈ సమస్యల నుండి మనము స్వతంత్రులమవుతాము. అప్పటికి కూడా మన రక్షణ పూర్తి కాదు. సమస్తమును సరిగాను నూతనముగాను చేయుటకు యేసుక్రీస్తు భూమి మీదికి తిరిగివచ్చుట కొరకు మనము అప్పటికీ ఎదురుచూస్తుంటాము. మన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మహిమగల పునరుత్థాన శరీరముల కొరకు, క్రొత్త ఆకాశములు మరియు క్రొత్త భూమి కొరకు మనము అప్పటికీ ఎదురుచూస్తుంటాము.

పాత నిబంధనలో, దేవుడు భవిష్యత్తులో అనుగ్రహించు రక్షణను నిరీక్షించమని దేవుని ప్రజలకు తరచుగా ఉపదేశించబడినది. మరియు ఈ ఉదాహరణను అనుసరిస్తూ, రక్షణ యొక్క భవిష్యత్ అంశముల మీద మన నిశ్చయతను క్రొత్త నిబంధన సాధారణంగా క్రైస్తవ్యము యొక్క గొప్ప నిరీక్షణ అని పిలుస్తుంది. ఉదాహరణకు, రోమా. 8:23-24లో ఈ మాటలను ఉపయోగిస్తూ భవిష్యత్ పునరుత్థానముపై మన నిరీక్షణను గూర్చి పౌలు మాట్లాడాడు:

> ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ, దత్త పుత్రత్వము కొరకు,అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు, మనలో మనము మూలుగుచున్నాము. ఏలయనగా మనము నిరీక్షణ కలిగినవారమై రక్షింపబడితిమి (రోమా. 8:23-24).

యేసు మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహించినంత నిశ్చయతతోనే, లోకమును నూతనపరచుట కొరకు మరియు మన స్వాస్థ్యమును మనకు అనుగ్రహించుటకు తిరిగివస్తాడు అనే నిశ్చయతతో కూడిన నమ్మకమునే నిరీక్షణ అంటారు. రక్షింపబడు విశ్వాసము వలె, ఇట్టి నిరీక్షణ స్థిరమైనది మరియు ఖచ్చితమైనదైయున్నది.

దేవుని నిబంధన వాగ్దానముల మీద అబ్రాహాము కలిగియున్న విశ్వాసముతో అనుబంధపరచుట ద్వారా హెబ్రీ 6 ఈ నిరీక్షణను గూర్చి మాట్లాడుతుంది. మరియు మన భవిష్యత్ రక్షణ అబ్రాహాముతో చేయబడిన వాగ్దానముల మీద ఆధారపడియున్నది అని అది చెబుతుంది. హెబ్రీ. 6:17-19లోని ఈ మాటలను వినండి:

> ఈ విధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై ... మనయెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానమును దృఢపరచెను. ఈ నిరీక్షణ నిశ్చలమును, స్థిరమునై, మన ఆత్మకు లంగరువలెనుండి తెరలోపల ప్రవేశించుచున్నది (హెబ్రీ 6:17-19).

మన నిరీక్షణ తాత్కాలికమైన లేక ఆశాజనక కోరిక కాదు. అది స్థిరమైనది మరియు నిశ్చయమైనది, ఎందుకంటే మన రక్షణను పూర్తి చేస్తాను అని దేవుడు వాగ్దానము చేశాడు.

ఇట్టి నిరీక్షణ సత్క్రియలను అనేక విధాలుగా పురికొల్పుతుంది. 1 థెస్స. 5:6-10 ప్రకారం, నిరీక్షణ అను శిరస్త్రాణము చురుకుతనమును మరియు స్వయం-నియంత్రణను పురికొల్పుతుంది. మరియు ఈ వచనములను దేవుని సర్వాంగకవచమును గూర్చి మాట్లాడు ఇతర వచనములతో పోల్చుట ద్వారా, దయ్యపు శక్తుల దాడుల నుండి మరియు శోధనల నుండి మనలను భద్రపరచుట ద్వారా నిరీక్షణ అను శిరస్త్రాణము ఒక విధముగా మనలను నియంత్రిస్తుంది అను విషయము స్పష్టమవుతుంది. కాబట్టి, పాపమును ఎదురించుటకు మనకు కారణమును ఇచ్చుట ద్వారా నిరీక్షణ సత్క్రియల కొరకు హేతువుగా పనిచేస్తుంది.

మన కొరకు వేచియున్న ఆశీర్వాదముల కొరకు ఎదురుచూచుచుండగా, మనము పాపము చేయునప్పటి కంటే ప్రభువుకు విధేయతను చూపునప్పుడు మరి ఎక్కువగా దీవించబడతాము అని మనము ఎరుగుదుము. పాపము యొక్క తాత్కాలిక ఆనందాలు మన కొరకు దేవుడు దాచియుంచిన నిత్య ఆశీర్వాదముల ఎదుట ఎన్నదగినవి కావు అని మనము ఎరుగుదుము.

మన భవిష్యత్ రక్షణ మీద నిరీక్షణ మరి ఎక్కువగా ప్రేమించుటకు మరియు బలమైన విశ్వాసము కలిగియుండుటకు మనలను పురికొల్పుతుంది అని కొలస్సీ. 1:5 నుండి మనము నేర్చుకుంటాము. మరియు అవును, ప్రేమ మరియు విశ్వాసము వాటంతట అవే సత్క్రియలు మాత్రమే కాదుగాని, సత్క్రియల కొరకు హేతువులు కూడా అయ్యున్నాయి. కాబట్టి, విశ్వాసము మరియు ప్రేమను పురికొల్పుట ద్వారా, నిరీక్షణ అపరిమితమైన సత్క్రియలకు మూలము అవుతుంది.

ఇదే విధముగా, నిరీక్షణ మన ఓరిమిని పెంచుతుంది అని, మన విశ్వాసములో నిలకడగా నిలబడి, దేవునికి ఇష్టమైన కార్యములను చేయుటలో పురికొల్పుతుంది అని 1 థెస్స. 1:3 బోధిస్తుంది. హేతువుగా నిరీక్షణ యొక్క అత్యంత సంగ్రహమైన సారాంశమును 1 పేతురు 1:13-15లో మనము చూడవచ్చు. ఈ వాక్యభాగములో పౌలు ఏమని రచించాడో గమనించండి:

> కాబట్టి మీ మనస్సు అను నడుముకట్టుకొని నిబ్బరమైన బుద్ధిగలవారై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృపవిషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి. … కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి (1 పేతురు 1:13-16).

నిరీక్షణ విధేయత చూపుటకు మరియు మన జీవితములోని ప్రతి కోణములో పరిశుద్ధముగా ఉండుటకు మనలను పురికొల్పుతుంది. యేసు స్వయంగా చేసినట్లు, కష్టములను ఎదుర్కొనుటకు అది మనలను సిద్ధపరుస్తుంది. హెబ్రీ. 12:5లో మనము చదువునట్లు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు. మీరు అలసట పడకయు మీ ప్రాణములు విసుకకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగ చేసిన తిరస్కార మంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి (హెబ్రీ. 12:2-3).

మనలో ప్రతి ఒక్కరము ఏదో ఒక సమయమందు నిరీక్షణను కోల్పోయిన అనుభవమును కలిగియున్నాము. దేవుడు మనలను విడిచిపెట్టాడు అని లేక మన విశ్వాసము నిజమైనదేనా అని భావించియుండవచ్చు. అయితే ఏది ఏమైనా, నిరీక్షణలేమి చాలాసార్లు మనలో నిస్సహాయతను కలిగిస్తుంది, మరియు మనము చేయు ఏది కూడా పరిస్థితులను మార్చలేదు అను భావన కలుగుతుంది. ఇది మన జీవితములో ఉద్దేశ్యమును మరియు అర్థమును లేకుండా చేస్తుంది. మరియు ఇది సులువైన పనులను కూడా అతి కష్టమైన పనులుగా అనిపించునట్లు చేస్తుంది.

క్రైస్తవులముగా మనము నిరీక్షణను కోల్పోయినప్పుడు, చాలాసార్లు పాపమును ఎదురించుటకు మనము చేయు ప్రయత్నములను నిలిపివేస్తాము. జీవితములో మనము ఎదుర్కొను సంఘర్షణలతో పోరాడు విషయములో మన ఉద్దేశ్యమును కోల్పోతాము, మరియు జీవితమంటేనే విరక్తి కలగవచ్చు. కాని మన నిరీక్షణ బలముగా ఉన్నప్పుడు, జీవితములోని అతి గొప్ప సవాళ్లను కూడా సహించుటకు, అనుదిన ఆటంకములను అధిగమించుటకు మనము పురికొల్పబడతాము, ఎందుకంటే మనలను భద్రపరచుదును అని వాగ్దానము చేసిన దేవుని మీద మన గురి నిలుపుకొనియుంటాము.

హేతువుల యొక్క ప్రాముఖ్యతను మరియు విశ్వాసము అను హేతువును ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, మన మూడవ ప్రధానమైన అంశమును గూర్చి మాట్లాడుటకు ఇప్పుడు సిద్ధముగా ఉన్నాము: ప్రేమ అను హేతువు.

## ప్రేమ అను హేతువు

ప్రేమ అనునది క్రైస్తవ విశ్వాసములో ఎంతో ఎక్కువగా గుర్తింపు పొందిన మరియు చాలా తక్కువగా అర్థము చేసుకోబడిన అంశములలో ఒకటైయున్నది, ప్రేమ అనునది బైబిలు బోధనలకు కేంద్రమైయున్నది

అని మనము చూస్తాము. దేవుని ప్రేమించమని, ఒకరినొకరు ప్రేమించమని, మన విరోధులను కూడా ప్రేమించమని మనకు ఉపదేశించబడినది. అదే సమయములో, ప్రేమించుట కొరకు బైబిలు ఇచ్చు ఆజ్ఞలను ఎలా నెరవేర్చాలో చాలామందికి అసలు తెలియదు.

యేసు పాత నిబంధన బోధనలను క్రోడీకరించిన విధానము మీకు జ్ఞాపకముందా? ధర్మశాస్త్రములో అతి గొప్ప ఆజ్ఞ ద్వితీ. 6:5 అయ్యున్నదని ఆయన సెలవిచ్చాడు, అక్కడ మనము దేవుని ప్రేమించాలని తెలియజేయబడింది. మరియు రెండవ గొప్ప ఆజ్ఞ లేవీ. 19:18లో ఉన్నది, అక్కడ మనము మన పొరుగువారిని ప్రేమించాలని వ్రాయబడియున్నది. తరువాత ఈ రెండు ఆజ్ఞలు పాత నిబంధన అంతటిని క్రోడీకరిస్తాయని ఆయన సెలవిచ్చాడు. మత్తయి 22:37-40లో ఆయన మాటలను వినండి:

> అందుకాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే. ఇది ముఖ్య మైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను (మత్తయి 22:37-40).

పాత నిబంధనలో ఉన్న వందల కొలది ఇతర ఆజ్ఞలు ఈ రెండింటి కంటే ఎంతో కొంత తక్కువ ప్రాముఖ్యమైనవి అని యేసు ఇక్కడ తెలియజేయుట లేదు. బదులుగా, ఇవి ఇతరులను కూడా చేర్చుతాయి కాబట్టి, ఇతరులు దీని మీద ఆధారపడియుంటారు కాబట్టి ఈ రెండు ఆజ్ఞలు గొప్ప ఆజ్ఞలు అయ్యున్నవి. మిగిలిన ఆజ్ఞలన్నీ వివరించు మరియు అనువర్తించు సాధారణ నియమములన్నిటిని ఇవి వ్యక్తపరుస్తాయి.

ఇదే నియమమును రోమా. 13:9 మరియు గలతీ. 5:14లో పౌలు బోధించాడు. వాస్తవానికి, సత్క్రియలన్నిటికి ప్రేమ ఎంత మౌలికమైనది అంటే, అది ఒకవేళ మన హేతువులలో భాగమైయుండకపోతే, మన క్రియలు ఏనాడు మంచివిగా ఎంచబడవు.

కాబట్టి, దేవుని మరియు పొరుగువారిని ప్రేమించుట చాలా కీలకమైన విషయమైయున్నది అని మనకు తెలుసు. అయితే ఇట్టి ప్రేమ ఎలా ఉంటుంది, మరియు అది మనలను ఎలా పురికొల్పవలసియున్నది? సరే, యేసు మాటల ప్రకారం, దేవుని ప్రేమించుటకు మరియు మన పొరుగువారిని ప్రేమించుటకు మార్గము ధర్మశాస్త్రము మరియు ప్రవక్తల బోధనలకు అనుగుణంగా జీవించుట, మరియు వాటిని సరిగా వ్యాఖ్యానించి మన పరిస్థితులకు అనువర్తించుట అయ్యున్నది. అవును, ప్రేమను గూర్చి అర్థము చేసుకొనుటకు ధర్మశాస్త్రము మరియు ప్రవక్తలు మనకు సహాయము చేయు మార్గములన్నిటిని విశదీకరించుట సాధ్యము కాదు. కాబట్టి ప్రేమను గూర్చిన బైబిలు బోధనలను క్రోడీకరించు నిర్వచనమును మూడు సామన్య మూలకముల దృష్ట్యా చూద్దాము.

ప్రేమలో ఆజ్ఞాధారకత్వము, క్రియలు మరియు అనురాగము భాగమైయున్నాయని క్రోడీకరిద్దాము. ఈ మూడు మూలకములు ప్రేమను గూర్చిన బైబిలు బోధనలు అన్నిటిని ఇంచుమించు తెలియజేస్తాయి, మరియు అనేక విధాలుగా అతివ్యాప్తి కూడా కలిగియుంటాయి. ప్రతి మూలకము దృష్ట్యా ప్రేమను పరిగణించుట ద్వారా, సత్క్రియలు చేయుటకు ప్రేమ మనలను పురికొల్పు విధానములను గూర్చి ఎన్నో విషయములను నేర్చుకోవచ్చు.

ప్రేమను గూర్చి మనము ఇచ్చిన నిర్వచనము కోవలో, మొదటిగా ఆజ్ఞాధారకత్వమును గూర్చి, రెండవదిగా క్రియలను గూర్చి, మరియు మూడవదిగా అనురాగమును గూర్చి మాట్లాడుతూ ప్రేమ అను హేతువును మనము విశదీకరిద్దాము. ప్రేమ మనలను దేవునికి మరియు మన పొరుగువానికి మేలు చేయుటకు ప్రోత్సహించు ఆజ్ఞాధారకత్వము చూస్తూ ఆరంభిద్దాము.

## ఆజ్ఞాధారకత్వము

ఆజ్ఞాధారకత్వమును గూర్చిన మన చర్చ మూడు భాగములుగా విభాగించబడుతుంది: మొదటిగా, మనము దేవునికి మరియు ఇతరులకు చూపవలసిన స్వామిభక్తిని గూర్చి మాట్లాదాము. రెండవదిగా, మన జీవిత ధోరణిని గూర్చి మాట్లాడదాము. మరియు మూడవదిగా, మన బాధ్యతను కనుగొనవలసిన ప్రాముఖ్యతను మనము ప్రస్తావిద్దాము. బైబిలు అజ్ఞాధారకత్వము మరియు హేతువులను గూర్చి మాట్లాడు కొన్ని ప్రధానమైన విధానములు ఇవి, కాబట్టి అజ్ఞాధారకత్వమును అర్థము చేసుకొనుటకు ఇవి మంచి పునాదిగా పనిచేస్తాయి. అజ్ఞాధారకత్వములో కీలక విషయమైన స్వామిభక్తిని గూర్చి మాట్లాడదాము.

### స్వామిభక్తి

అనేక విధాలుగా స్వామిభక్తి అనునది ప్రేమ అను అంశమునకు మూలరాయి అయ్యున్నది. మునుపటి పాఠములో మనము చూసినట్లు, పాత నిబంధన దేవుడు తన ప్రజలకు నిబంధనా రాజుగా తరచుగా చిత్రీకరిస్తుంది. ఆయన ప్రభువు లేక సర్వోన్నత చక్రవర్తి అయ్యున్నాడు, మరియు ఆయన ప్రజలు ఆయన సామంతులు లేక సేవక రాజ్యము అయ్యున్నారు. మరియు ప్రతి ఇతర రాజ్యములో వలెనే, రాజునకు స్వామిభక్తిని చూపుట ప్రజలందరి యొక్క అత్యంత మౌలికమైన బాధ్యత అయ్యున్నది. అయితే ఇది ప్రేమతో ఎలాంటి సంబంధం కలిగియున్నది?

సరే, ప్రాచీన పశ్చిమ ఆసియాలో (పాత నిబంధన లోకములో), ప్రభువు మరియు ఆయన సామంత రాజ్యము మధ్య ఉన్న నిబంధన అనుబంధమును ప్రేమ దృష్ట్యా వర్ణించుట చాలా సామన్యమైన విషయమైయుండేది. ప్రభువు యొక్క ప్రేమ చాలా వరకు ఆయన ప్రజల పట్ల నిబంధన స్వామిభక్తి రూపములో వ్యక్తపరచబడేది. ఆయన వారికి కాపుదలను అనుగ్రహిస్తాడు, వారి కొరకు న్యాయమును



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చేకూర్చుతాడు, మరియు వారి ఐహిక అవసరతలను తీర్చుతాడు. ఇది వారి పట్ల అతని ప్రేమ అయ్యున్నది. దీనికి ప్రత్యుత్తరముగా, సామంత ప్రజలు ఆయనకు స్వామిభక్తి చూపవలసియుండినది. వారు ఆయన ఆజ్ఞలను పాటించవలసియుండెను, పన్ను మరియు సేవలు చేయుట ద్వారా ఆయనకు మద్దతునియ్యవలసియుండెను, మరియు తమ రాజుగా ఆయనను ఘనపరచవలసియుండెను. ఇది వారి పట్ల ఆయన ప్రేమ అయ్యున్నది. ఇదే విధముగా, తమ పొరుగువారిని తోటి పౌరులుగా ఎంచుట ద్వారా, వారిని గౌరవించి, వారి శ్రద్ధవహించుట ద్వారా పౌరులు ఒకరినొకరు ప్రేమించుకొనవలసియుండెను.

ఈ ప్రేమ భావన కోవలోనే, ప్రాచీన పశ్చిమ ఆసియాలోని నిబంధన రాజ్యములు ప్రభువు మరియు ఆయన సామంతుల మధ్య ఉన్న అనుబంధమును వర్ణించుటకు అనేక అలంకారములను ఉపయోగించేవారు. చాలాసార్లు, యెషయా 64:8లో వలె ప్రభువు తండ్రిగా వర్ణించబడేవాడు, మరియు సామంత రాజులు ఆయన పిల్లలుగా వర్ణించబడేవారు. యిర్మీయా 31:32లో వలె, ఈ అనుబంధము భార్యభర్తల అనుబంధము దృష్ట్యా కూడా వర్ణించబడుట మనము చూస్తాము. ఈ విధముగా రాజుతో వారి అనుబంధమును గూర్చి ఆలోచన చేయుట ద్వారా, ప్రజలు తమ పట్ల ఆయన భావనలను మరియు ఆయన పట్ల వారి బాధ్యతలను అర్థము చేసుకోగలిగేవారు. మరియు రాజ్యములోని పౌరులందరూ ఒకే కుటుంబ సభ్యులు కాబట్టి, వారు ఒకరినొకరు తమ సహోదరీ సహోదరులుగా భావించవలసియుండేది. కుటుంబము దృష్ట్యా ఈ రాజకీయ అనుబంధములను గూర్చి ఆలోచించుట ద్వారా ఈ ప్రేమగల ఆజ్ఞాధారకత్వము మరియు స్వామిభక్తి హృదయపూర్వకమైనవిగా ఉండాలని ప్రజలు గుర్తించగలిగారు. ప్రజలు రాజును గౌరవించుటకు, ఘనపరచుటకు మరియు విధేయత చూపుటకు, మరియు తమ పొరుగువానితో నిజమైన కనికరము మరియు దయతో వ్యవహరించుటకు ఇది వారిని పురికొల్పిన అంతర్గత కటాక్ష నియమము అయ్యుండవలసియుండెను.

ద్వితీ. 6లో ఈ ఆలోచన కార్య రూపము దాల్చుట మనము చూస్తాము, అక్కడ మోషే ఇశ్రాయేలీయులు దేవునికి ఇవ్వవలసిన స్వామిభక్తిని మరియు విధేయతను వివరించుటకు ప్రేమ అను భావనను ఉపయోగించాడు. అధ్యాయమంతటిని వ్యాఖ్యానించుట సహకారముగా ఉంటుందిగాని, కొన్ని కథనములను మాత్రమే ఎత్తిచూపుటకు సమయము అనుకూలిస్తుంది. ఉదాహరణకు, ద్వితీ. 6:2, 5లోని ఈ మాటలను వినండి:

> .... మీకు బోధింపవలెనని మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించిన ధర్మమంతయు అనగా కట్టడలు విధులు ఇవే. నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను (ద్వితీ. 6:2, 5).

ఈ అధ్యాయములో, దేవుని కొరకు ప్రేమ దేవుని ఆజ్ఞలు, శాసనములు మరియు నియమముల పట్ల విధేయత దృష్ట్యా క్రోడీకరించబడింది. మరియు ఈ సారంశము తరువాత దేవుని పట్ల ఇశ్రాయేలు ప్రేమ చూపవలసిన అనేక విధానములు ఇవ్వబడినవి.

ఉదాహరణకు, ద్వితీ. 6:13-17 స్వామిభక్తి మరియు విధేయతను ఉద్ఘాటిస్తుంది. అక్కడ మోషే వ్రాసిన మాటలను వినండి:

> నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెను. మీరు ఇతర దేవతలను, అనగా మీ చుట్టునున్న జనముల దేవతలను సేవింపకూడదు. నీమధ్యను నీ దేవుడైన యెహోవా రోషముగల దేవుడు గనుక నీ దేవుడైన యెహోవా కోపాగ్ని ఒకవేళ నీమీద రగులుకొని దేశములో నుండకుండ నిన్ను నశింపజేయును... మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను, అనగా ఆయన నీకు నియమించిన శాసనములను కట్టడలను జాగ్రత్తగా ఆచరింపవలెను (ద్వితీ. 6:13-17)

ఇప్పుడు, మన కొరకు దేవుని ప్రేమ ఒక సామాన్య తండ్రి తన పిల్లల యెడల కలిగియుండు ప్రేమను పోలినదైయుంటే, మనము ఆయనను అనుసరించుటలో విఫలమైనయెడల మనలను నాశనము చేయుటకు ఆయన చూపు సముఖతను గూర్చి వినాలని ఏనాడు ఆశించము. కాని వాస్తవము ఏమిటంటే, దేవుని యొక్క తండ్రి ప్రేమ ఒక రాజు తన ప్రజల కొరకు కలిగియుండు ప్రేమను పోలియున్నది. పితృత్వం అను రూపకము సహాయకరమైనదే, ఎందుకంటే అది దేవుడు మనలను రక్షించు, మనకు సమకూర్చు, మరియు మన పట్ల శ్రద్ధవహించు విధానములను ఎత్తిచూపుతుంది. అయినప్పటికీ పితృత్వం కేవలం ఒక రూపకము మాత్రమే అయ్యున్నది. ఈ రూపకము వెనుక దేవుడు మన రాజు అయ్యున్నాడు అను వాస్తవము ఉన్నది. ఆయన నిజముగా మనలను పాలించుచున్నాడు. ఆయన నిజముగా సార్వభౌముడైయున్నాడు. మనము నిజముగా ఆయనతో నిబంధనలో కట్టుబడియున్నాము. కాబట్టి మన నిజాయితీగల నిబంధన స్వామిభక్తి ద్వారా అత్యంత మౌలికమైన మరియు అత్యంత ప్రాముఖ్యమైన రీతిలో ఆయన కొరకు మన ప్రేమను చూపించవచ్చు.

మరియు క్రొత్త నిబంధన ఈ ఆలోచనను అనేక విధాలుగా నిర్ధారిస్తుంది. ఉదాహరణకు, యేసు మన ప్రభువు మరియు రాజు అయ్యున్నాడు, మరియు స్వామిభక్తితో కూడిన విధేయత చూపుట ద్వారా, మరియు ఆయన సంఘము పట్ల స్వామిభక్తి చూపుట ద్వారా ఆయన పట్ల మన ప్రేమను చూపవలసియున్నది. మనము ఆయన నుండి దూరముకాలేము లేక తిరస్కరించలేము. ఆయన పట్ల మనము కలిగియున్న స్వామిభక్తి కంటే ఎక్కువ స్వామిభక్తిని మనము ఇతరులకు చూపలేము. మనపై ఆయన ఉంచిన బాధ్యతలను మనము తిరస్కరించలేము. మరియు ఆయన ప్రేమించు ప్రజలతో మనము దుర్వ్యవహారం



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చేయలేము లేక వారిని విడిచిపెట్టలేము. అట్టి స్వామిద్రోహమును చూపుట అంటే ఆయనను ద్వేషించుట మరియు ఆయన తీర్పును ఆహ్వానించుట అయ్యున్నది. అయితే ఆయన యెడల ప్రేమ యందు మనము స్థిరముగా నిలిచియుంటే, ఆయన రాజ్యములో ఆయన మనకు ప్రతిఫలమును ఇస్తాడు.

ప్రకటన 1:4-6ను పరిగణించండి, అక్కడ యోహాను తన గ్రంథమును ఈ విధంగా పరిచయం చేశాడు:

> … భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు, కృపాసమాధానములు మీకు కలుగునుగాక. మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపముల నుండి మనలను విడిపించినవానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగునుగాక, ఆమేన్. ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను జేసెను (ప్రకటన 1:5-6).

మత్తయి 14:15లో యేసు సెలవిచ్చినట్లు:

> మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు (యోహాను 14:15).

మనతో దేవుని యొక్క నిబంధన అనుబంధములో, స్వామిభక్తి ఒక భావార్థక సద్గుణమైయున్నది, మన ప్రభువు మరియు రాజును సేవించుటకు, మరియు ఆయన పరిపాలన క్రింద జీవించువారిని గౌరవించుటకు మరియు వారిని సంరక్షించుటకు ఇది మనలను పురికొల్పుతుంది. భిన్నముగా, ఇది ఒక అభావార్థక అవసరత కూడా అయ్యున్నది, మరియు మన జీవితాలలో ఇతర దేవతలు మరియు విగ్రహములతో ప్రత్యర్థి పొత్తులను నిషేధిస్తుంది.

స్వామిభక్తిని గూర్చిన ఈ అవగాహనను మనస్సులో ఉంచుకొని, దేవుని పట్ల మన ప్రేమ జీవితములో ఒక నూతన ధోరణిని ఆలవరచుకొనుటకు కోరు విధానమును గూర్చి మాట్లాడదాము.

## ధోరణి

దేవునికి మనము ఋణపడియున్న ఆజ్ఞాధారకత్వము మన జీవితములలోని ప్రతి భాగమును తాకుతుంది. ఆయన రాజ్యమునకు వెలుపల లేక ఆయన సార్వభౌమ పరిపాలనకు బయట జరుగు ఏ జీవిత కోణము లేదు. ఈ కారణము చేత, మన జీవితములు సంపూర్ణముగా దేవుని చుట్టూ తిరుగుతుండాలి. దేవుడు మరియు ఆయన రాజ్యము మన అత్యున్నతమైన ప్రాధాన్యతలుగాను, మన ఆశల యొక్క గురిగాను, మన దృష్టికోణము యొక్క కేంద్రముగాను ఉండాలి. మనము ఆలోచించు, చెప్పు, మరియు చేయు ప్రతిదానిలో దేవుని యొక్క మరియు ఆయన ప్రజల యొక్క లాభము నిమిత్తము పనిచేయుటకు అంతరంగ సమర్పణ కలిగియుండాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇంతకు ముందు మనము చూసినట్లు, మొదటి గొప్ప ఆజ్ఞ అయిన ద్వితీ. 6:5, మానవ వ్యక్తిత్వమును హృదయము, ఆత్మ మరియు శక్తి దృష్ట్యా క్రోడీకరిస్తుంది. మనము మూడు లేక నాలుగు భిన్నమైన భాగములుగా విభాగించబడవచ్చు అన్నట్లు, ఈ పదములు మన ఉనికిలోని పలు భాగములను సూచించుటకు ఉద్దేశించబడలేదు. బదులుగా, ప్రతి ఒక్కటి పూర్ణ వ్యక్తిత్వమును గూర్చి మాట్లాడుతుంది. హెబ్రీ పదజాలములో, మన హృదయము కేవలం మన భావనలు మాత్రమే కాదుగాని, మన మనస్సు, మన మనస్సాక్షి, మరియు మన ప్రవర్తనలోని ప్రతి ఇతర కోణముతో సహా మన పూర్ణ అస్థిత్వమునకు కేంద్రమైయున్నది. ఇదే విధముగా, మన చేతన మనస్సు మరియు అచేతన ఆశలతో సహా మన ప్రాణము మన సంపూర్ణత అయ్యున్నది. మరియు ద్వితీయోపదేశకాండములో ఉన్న “శక్తి” అను పదము మన పట్ల దేవుడు కలిగియున్న ప్రేమ యొక్క తీవ్రతను, మరియు ఆ ప్రేమను అన్వేషించుటకు మన సామర్ధ్యములన్నిటిని ఉపయోగించు మన నిశ్చయతను సూచించునంత విధముగా మన శరీరములను లేక క్రియలను సూచించదు. కాబట్టి, ఈ పదములన్నిటి ద్వారా, మన పూర్ణ ఉనికిని ఉపయోగించి మనము దేవుని పట్ల సమర్పణ కలిగియుండాలని లేఖనము మనకు ఉపదేశిస్తుంది.

ఈ గొప్ప ఆజ్ఞను మన పొరుగువారిని ప్రేమించుటను గూర్చి ఇవ్వబడిన ఆజ్ఞతో జతచేయుట ద్వారా, ఇతర ప్రజల కొరకు మరిముఖ్యముగా దేవుని రాజ్యములో మన తోటి పౌరుల కొరకు ఇదే రకమైన ప్రేమను కలిగియుండాలని యేసు సూచించాడు. దేవుని పట్ల మరియు ఆయన ప్రజల పట్ల ఇట్టి సమర్పణలు మన జీవితములో ప్రాథమికమైన ధోరణి అయ్యుండాలి. అవి మన అంతరంగ నిర్ణయముల యొక్క అత్యంత మౌలికమైన సమర్పణలు అయ్యుండాలి.

అవును, జీవితములో సరియైన ధోరణికి అతి గొప్ప ఉదాహరణ యేసే. యేసు తన జీవితమంతటిని దేవుని చుట్టూ మరియు తాను రక్షించుటకు వచ్చిన ప్రజల చుట్టూ వెచ్చించాడు. ఈ ధోరణి అన్ని విషయములలో దేవునికి పరిపూర్ణముగా విధేయత చుపునట్లు మరియు తాను ప్రేమించిన ప్రజల కొరకు హృదయపూర్వకముగా తనను తాను బలి ఇచ్చునట్లు ఆయనను పురికొల్పాయి. మరియు దేవుని పట్ల మరియు మన పొరుగువారి పట్ల మనము కలిగియున్న ఆజ్ఞాధారకత్వము మన జీవితములలో కూడా అదే ధోరణిని కలిగియుండునట్లు మనలను నడిపిస్తుంది. యేసు చేసిన అవే అర్పణలను చేయునట్లు కూడా అది మనలను పురికొల్పవలసియున్నది. 1 యోహాను 3:16లో మనము చదువునట్లు:

> ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనముకూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమైయున్నాము (1 యోహాను 3:16).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనము దేవుని మన జీవితములకు కేంద్రముగా చేసుకొనునప్పుడు, అది మన ఆలోచనలు మొదలు, మనము ఇతరులతో వ్యవహరించు విధానమును, మనము వివాహము చేసుకొనుటకు నిర్ణయించుకొను వ్యక్తి వరకు మన నిర్ణయములన్నిటిని ప్రభావితము చేస్తుంది. మనము మన జీవితములను దేవుని చుట్టూ కేంద్రీకరించు విషయములో విఫలమైనప్పుడు, డబ్బు, లేక అధికారము, లేక ఖ్యాతి, లేక ఆహ్లాదము, లేక ప్రజాకర్షణ కలిగిన వ్యక్తులు వంటి ఇతర ప్రాధాన్యతలతో మన జీవితములు నిండిపోతాయి. మరియు ఇట్టి ధోరణులు మన ప్రవర్తనను కూడా ప్రభావితము చేయగలవు, కాని ఆయన వాక్యములో దేవుడు తెలిపిన విధానమునకు భిన్నమైన ఇతర ఉద్దేశ్యములతో అవి ప్రభావితము చేస్తాయి. అయితే మన జీవితములను మనము దేవుని చుట్టూ మరియు ఆయన ప్రజల చుట్టూ కేంద్రీకరించినప్పుడు, మనము ఆయన రాజ్య ఉద్దేశ్యమును అనుసరిస్తాము, మరియు ఆయనను సంతోషపరచు విధానములలో జీవించుటకు పురికొల్పబడతాము.

స్వామిభక్తి మరియు ధోరణి అను విషయములను గూర్చి మాట్లాడాము కాబట్టి, ఇప్పుడు దేవుని కొరకు మరియు మన పొరుగువాని కొరకు ప్రేమ జీవితములోని ప్రతి భాగములో ప్రభువు ఎదుట మన బాధ్యతను కనుగొనునట్లు మనలను పురికొల్పు విధానమును పరిగణించుటకు సిద్ధముగా ఉన్నాము.

## బాధ్యత

ప్రేమ అనునది దేవుని యెడల విధేయత మరియు ఆయనను సేవించుట అను ధోరణి అయ్యున్నది. కాబట్టి, దేవుని ఆజ్ఞలన్నిటిని పాటించునట్లు అది మనలను పురికొల్పాలి. కాని ఖచ్చితముగా మనము దీనిని ఎలా చేయగలము? ఇది ధర్మశాస్త్రములో ఉన్న నియమములను మరియు అవసరతలన్నిటిని లెక్కించి, అవి స్పష్టముగా తెలియజేయు విషయములను చేయుట మాత్రమే అయ్యున్నదా? లేక లేఖనములో విశేషముగా ప్రస్తావించబడిన ఉదాహరణలను మించిన రీతులలో మనము ప్రభువును సేవించవలసియున్నదా? సరే, దేవుని పట్ల మన ప్రేమగల ఆజ్ఞాధారకత్వము మనము ఆయన యెడల బాధ్యత కలిగియున్న అదనపు మార్గములను వెదకునట్లు మనలను పురికొల్పవలసియున్నది.

దీని అర్థము ఏమిటో చూచుటకు, పది ఆజ్ఞలను పరిశీలన చేద్దాము. నిర్గమ. 20:3-17లో వ్రాయబడియున్న ప్రకారం, ఆజ్ఞలు ఏవనగా:

- నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.
- దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు.
- నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు.
- విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము.
- నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.
- నరహత్య చేయకూడదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

- వ్యభిచరింపకూడదు.
- దొంగిలకూడదు.
- నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు.
- నీ పొరుగువానిదానిని ఆశించకూడదు.

వీటిలో ఎనిమిది ఆజ్ఞలు విశేషముగా కొన్ని ప్రవర్తనలను నిషేదిస్తాయి, మరియు మనము క్రియాశీలకముగా చేయవలసిన పనులను స్పష్టముగా ప్రస్తావించవు. మన బాధ్యతలన్నీ లేఖనములో స్పష్టముగా ప్రస్తావించబడినవి అని మనము ఊహిస్తే, మనము కేవలం రెంటిని మాత్రమే క్రియాశీలకముగా అన్వేషించాలి అని నిర్ధారిస్తాము: విశ్రాంతి దినమును ఆచరించుట, మరియు మన తల్లిదండ్రులను సన్మానించుట. అదే విధముగా, హత్యకు విరోధముగా ఇవ్వబడిన ఆజ్ఞ హత్యను నిషేధిస్తుందిగాని దుర్నీతితో కూడిన కోపమును నిషేధించదు అని మనము నిర్ధారించవచ్చు. కాని అలా చేస్తే తప్పు అవుతుంది. వాస్తవమేమిటంటే బైబిలు ఈ ఆజ్ఞలను మన జీవితములలోని ప్రతి భాగమునకు తరచుగా అనువర్తిస్తుంది.

ఒక ఉదాహరణగా, మత్తయి 5:21-22ను పరిగణించండి, అక్కడ యేసు ఈ క్రింది బోధను చేశాడు:

> నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును (మత్తయి 5:21-22).

ఇక్కడ యేసు ప్రజలకు తెలుపబడిన విషయములను, అనగా, లేఖనము యొక్క యూదా వ్యాఖ్యాతలు వారికి బోధించిన విషయములను సూచించుచున్నాడు.

మనము దేవుని ఎదుటి మన బాధ్యతలను వెదకకపోతే, దేవుని వాక్యము మన జీవితములలోని చాలా చిన్న భాగమును మాత్రమే కట్టుబడునట్లు చేస్తుంది అనే, మనము ఆయనకు చెల్లించవలసిన ఆజ్ఞాధారకత్వము చాలా పరిమితమైనది అనే ఆలోచనను అభివృద్ధి చేసుకొనుట చాలా సులభమవుతుంది. మన పరిస్థితులు లేఖనములో ఉన్నవాటి కంటే భిన్నముగా ఉన్నాయి కాబట్టి, దేవుడు నియమించు అర్హతలు మనకు వర్తించవు అని ఆలోచించి పొరపాటును చేస్తుంటాము. ఇది మనలను బాధ్యతలు తెలియనివారిగా చేస్తుంది కాబట్టి మనలను మనము పాపము నుండి రక్షించుకోలేము.

అయితే మన జీవితములోని ప్రతి భాగములో మనము ఆయనకు బద్ధులమైయున్నామని అర్థము చేసుకొని దేవుని ఎదుట మన బాధ్యతలను సరిగా వెదకినప్పుడు, ఆయన ఆమోదించు నిర్ణయములను తీసుకొనుటకు సరియైన స్థితిలో మనము ఉంటాము. దేవుని యెడల మన ప్రేమ ఆయన అర్హతలు మరియు మన పొరుగువారి యొక్క అవసరతలను గూర్చిన పరిమిత జ్ఞానమును బట్టి మనలను అసంతృప్తిపరులను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చేయాలి. మన బాధ్యతను ఉత్తమమైన రీతిలో నెరవేర్చుటకుగాను మన గొప్ప రాజు మరియు ఆయన ప్రజల పట్ల మన బాధ్యతలన్నిటిని కనుగొనునట్లు అది మనలను పురికొల్పాలి.

ఆజ్ఞాధారకత్వమును గూర్చి మాట్లాడాము కాబట్టి, ఇప్పుడు క్రియలు అను అంశమును చూద్దాము, మరియు ఇది దేవునితో మరియు ఒకరితో ఒకరు వ్యవహరించవలసిన విధానమును వర్ణిస్తుంది.

## క్రియలు (1:19-27)

క్రియలను గూర్చిన మన సంభాషణ రెండు భాగములుగా విభాగించబడుతుంది. విశేషముగా, దేవుని క్రియలు మన వ్యక్తిగత ప్రవర్తన కొరకు మాదిరులుగా పనిచేయు విధానములను గూర్చి మాట్లాడదాము. ఒక వైపున, ప్రాయశ్చిత్త కృప ద్వారా దేవుడు చేయు క్రియలను చూద్దాము. మరొక వైపున, సామాన్య కృప ద్వారా దేవుడు చేయు క్రియలను చూద్దాము. మన క్రియల కొరకు దేవుని ప్రాయశ్చిత్త మాదిరిగా పనిచేయు విధానమును చూస్తూ ఆరంభిద్దాము.

### ప్రాయశ్చిత్త కృప

ఈ పాఠ్యక్రమము అంతటిలో మనము చెప్పినట్లు, దేవుని స్వభావము మన ఉన్నతమైన నైతిక స్థాయి అయ్యున్నది. మరియు దేవుడు తన స్వభావమునకు అనుగుణంగా ఎల్లప్పుడు కార్యములు చేస్తాడు కాబట్టి, ఆయన క్రియలన్నీ ఆయన స్వభావము యొక్క పరిపూర్ణ వ్యక్తీకరణ అయ్యున్నది.

ఇందుమూలముగానే మన ప్రవర్తన మరియు మన క్రియలు దేవుని స్వభావమునకు అనుగుణంగా ఉండాలని, ముఖ్యముగా ఆయనను ప్రేమించువారిని ఆయన విడిపించు మరియు విమోచించు దృష్ట్యా ఉండాలని లేఖనము మనలను ఉపదేశిస్తుంది. ఉదాహరణకు, ద్వితీ. 5:13-15లో ఇశ్రాయేలువారందరు విశ్రాంతి దినమును ఆచరించాలని దేవుడు కోరాడు. వారిని ఐగుప్తు బానిసత్వము నుండి విమోచించి దేశమంతటికి దేవుడు కలిగించిన విశ్రాంతిని అనుకరిస్తూ యజమానులు, సేవకులు, పరదేశులు మరియు జంతువులు కూడా విశ్రాంతిని పొందాలి.

అదే విధంగా, మత్తయి 18:23-35లో, మనము దేవుని క్షమాపణను అనుకరించాలి అని యేసు బోధించాడు. మనకు విరోధముగా పాపము చేయువారిని మనము క్షమించాలి ఎందుకంటే ఆయనకు విరోధముగా పాపము చేసినందుకు దేవుడు మనలను క్షమించాడు. దేవుడు మనలను క్షమించిన విధముగానే, ఇతరులను మనము క్షమించుట కూడా నిజమైనదిగాను, హృదయపూర్వకమైనదిగాను, వారి పట్ల కనికరము ద్వారా పురికొల్పబడినదిగాను ఉండాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరింత సామాన్యముగా, దేవుడు మన యెడల చూపిన ప్రేమకు అనుకరణగా మనము ఒకరినొకరము ప్రేమించాలని లేఖనము బోధిస్తుంది. మరియు అవును, దీనికి ఉన్నతమైన ఉదాహరణ మన పాపముల కొరకు మరణించిన యేసే. 1 యోహాను 4:9-11లో యోహాను చేసిన బోధను వినండి:

> మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది. ప్రియులారా, దేవుడు మన లను ఈలాగు ప్రేమింపగా మనమొకనినొకడు ప్రేమింప బద్ధులమై యున్నాము (1 యోహాను 4:9-11).

పాపులముగా, మనము దేవునికి విరోధులమైయున్నాము. మనము ఆయనను ద్వేషించాము. మనము ఆయనకు విరోధులముగా ఆయన ఎదుట నిలిచియున్నాము. మనము కనికరముగాక, శిక్షకు అర్హులమైయున్నాము. అయినను, దేవుడు తాను బహుగా ప్రేమించిన తన కుమారుని మనలను రక్షించుటకు బలిగా అర్పించుటకు ఇష్టపడ్డాడు. మరియు ఈ ఉదాహరణను అనుసరించి, ఇతరుల కొరకు శ్రమను అనుభవించుటకు మనము సుముఖత చూపువారిగా ఉండాలి.

అవును, మరొకరి కొరకు మనము ఏనాడూ ప్రాయశ్చిత్త అర్పణను అర్పించలేము — మరియు మనము అలా చేయాలని లేఖనము కోరుటలేదు. అయితే ప్రాయశ్చిత్తము చేసినప్పుడు దేవుడు మన యెడల చూపిన అదే రకమైన ప్రేమను మనము చూపాలని అది మనలను కోరుతుంది. మన సొంత పిల్లల కొరకు ఈ అర్పణలను చేయుటకు మనము ఇష్టపడతాము, ఎందుకంటే మనము మన సొంత ప్రాణముల కంటే వారి జీవితములకు ఎక్కువ విలువ ఇస్తాము. మరియు ఆయన పిల్లలకు కూడా అదే విలువను ఇస్తూ ఆయన కృపను అనుకరించమని దేవుడు మనలను కోరుచున్నాడు. 1 యోహాను 3:16-18లో యోహాను వ్రాసినట్లు:

> ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనముకూడ సహోదరులనిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమైయున్నాము. ఈ లోకపు జీవనోపాధిగలవాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? చిన్నపిల్లలారా, మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము (1 యోహాను 3:16-18).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని ప్రాయశ్చిత్త కృపను అనుకరించుటలో మనము విఫలమైనప్పుడు, మన నామకార్థ "ప్రేమ" కేవలం మాటలలోనే మిగిలిపోతుంది. ఉదాహరణకు, పేదలు పేదరికములో జీవించుటకు యోగ్యులు లేక వారిని పోషించుట మరొకరి బాధ్యత అని ఆలోచన చేయుట చాలా సులభమైన పని. ఇతరుల ఆసక్తుల కంటే మన ఆసక్తులకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చుట మరియు ఇతరులకు సహాయము చేయుటలో శ్రమపడకుండా సౌకర్యమును మరియు సదుపాయములను కోరుకొనుట చాలా సులువైన పని.

కాని దేవుని కృపగల మాదిరి మన డబ్బును మరియు ఆస్తులను, మరియు మన జీవితాలను కూడా విడచి, క్రీస్తునందు మన సహోదరీ సహోదరులను సంరక్షించుట మరియు పోషించునట్లు మనలను బద్ధులనుగా చేస్తుంది. వారి కొరకు బలి అర్పించుట, వారి కొరకు శ్రమను అనుభవించుట, మరియు వారి కొరకు మరణించుటకు కూడా పురికొల్పబడు విధముగా వారిని హృదయపూర్వకముగా ప్రేమించాలని అది మనకు బోధిస్తుంది.

దేవుని ప్రాయశ్చిత్త కృపను గూర్చిన ఈ అవగాహనను మనస్సులో ఉంచుకొని, మనము అనుసరించుటకు ఆయన సామన్య కృప అనుగ్రహించు మాదిరిని గూర్చి మాట్లాడుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## సకల జనులకు వర్తించు కృప

సామాన్య కృప అనునది వేదాంతశాస్త్రములో పారిభాషిక పదమైయున్నది మరియు ఏనాడు రక్షణపొందనివారి పట్ల దేవుడు చూపు కనికరమును సూచిస్తుంది. మనలో తుదకు రక్షణను పొందుకొనువారి కొరకు, దేవుని కృప ఎల్లప్పుడు విమోచనను కలిగించుట కొరకు పనిచేస్తుంది. అయితే ఏనాడు రక్షణను స్వీకరించలేనివారి కొరకు దేవుడు విమోచనేతర కనికరమును, లేక "సామాన్య కృప"ను, కూడా అనుగ్రహించగలడు.

కొండ మీద ప్రసంగములో, దేవుని సామన్య కృపను యేసు మానవాళి కొరకు ఆయన కలిగియున్న ప్రేమ యొక్క వ్యక్తీకరణ అని సంబోధించాడు. ఖచ్చితముగా, మానవాళి కొరకు దేవుని యొక్క సామాన్య ప్రేమ విశ్వాసుల కొరకు ఆయన కలిగిన ప్రేమ అంత గొప్పది కాదు. ఏది ఏమైనా, అది నిజమైనది మరియు నిజాయితీగలది, మరియు మనము అనుకరించవలసిన మాదిరిని అది మనకు అనుగ్రహిస్తుంది. మత్తయి 5:44-48లో సామాన్య కృపను గూర్చి యేసు ఈ క్రింది బోధను చేశాడు:

> మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి. ఆయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీదను, అనీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు. మీ

> పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు (మత్తయి 5:44-48).

యేసు బోధించినట్లు, దేవుని పూర్ణతలో దుష్టప్రజల కొరకు, అనగా ఏనాడు క్రీస్తునందు విశ్వాసములోనికి ప్రవేశించలేనివారి కొరకు, ఆయన కలిగియున్న ప్రేమ భాగమైయున్నది. మరియు దేవుడు ఈ ప్రేమను అనేక విధాలుగా వ్యక్తపరచుతాడు, సూర్యరశ్మి మరియు వర్షము వంటివి. దేవుడు ప్రజలందరికి కనికరము చూపుతూ, ప్రకృతిలో వారికి స్థిరత్వమును మరియు ఉత్పత్తిని అనుగ్రహిస్తూ, వారి జీవితములలోఫలించుటకు అనుమతి ఇస్తాడు. అనగా దేవుడు ఎల్లప్పుడు కనికరము చూపుతాడు అని అర్థము కాదు — ఆయన ఎల్లప్పుడు కనికరము చూపడు. కొన్నిసార్లు ఆయన దుష్టుల మీద తీర్పును కలిగిస్తాడు. కాని సాధారణముగా, ఆయన శత్రువుల పట్ల కూడా సహనమును, దాతృత్వమును కనుపరుస్తాడు.

మరియు మనము దేవుని ప్రేమించుచున్నాము కాబట్టి, ఆయన ప్రేమించు ప్రజలను కూడా ప్రేమించవలసియున్నది. దేవుని ఉదాహరణను అనుసరిస్తూ, వారు మనలను ద్వేషించినా మరియు హింసించినా, ప్రజలందరితో మంచిగా ఉండి వారి పట్ల కనికరము చూపునట్లు ప్రేమ మనలను పురికొల్పాలి. ఉదాహరణకు, నిర్గమ. 23:4-5లో, మన విరోధుల వస్తువులను మనము కాయాలని దేవుని ధర్మశాస్త్రము ఆజ్ఞాపిస్తుంది. అక్కడ వ్రాయబడిన మాటలను వినండి:

> నీ శత్రువుని యెద్దయినను గాడిదయైనను తప్పిపోవుచుండగా, అది నీకు కనబడిన యెడల అగత్యముగా దాని తోలుకొనివచ్చి వాని కప్పగింపవలెను. నీవు నీ పగవాని గాడిద బరువుక్రింద పడియుండుట చూచి, దానినుండి తప్పింపకయుందునని నీవు అనుకొనినను అగత్యముగా వానితో కలిసి దాని విడిపింపవలెను (నిర్గమ. 23:4-5).

ఈ ఉపదేశములు న్యాయమును గూర్చి మాట్లాడుతున్న సందర్భములో కనిపిస్తాయి. వారు మనలను ద్వేషించినా ప్రజలందరి కొరకు మనము న్యాయమును చేకూర్చాలని ఇక్కడ ఆలోచన అయ్యున్నది.

అయితే కేవలం మన విరోధుల కొరకు మాత్రమే న్యాయమును భద్రపరచమని యేసు మనకు చెప్పలేదు; వారిని ప్రేమించమని కూడా ఆయన సెలవిచ్చాడు. వారు న్యాయము యొక్క లాభములను మరియు భద్రతను కలిగియుండాలని, మరియు న్యాయమునకు ప్రమాణమైన దేవుని మనము ప్రేమించుచున్నాము కాబట్టి, మనము వారికి న్యాయమును చేకూర్చాలి.

మన విరోధుల పట్ల ఇట్టి ప్రేమ లేకుండా ఉండుట చాలా సులభమే. మహా అయితే, సాధారణంగా వారి అవసరతలను విస్మరించాలని మనము ఆశించవచ్చు. లేకపోతే, మనము వారి మీద ప్రతీకారము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తీసుకొనుటకు పురికొల్పబడి, వారు అన్యాయములను ఎదుర్కొనునప్పుడు ఆనందించవచ్చు. అయితే ఇవి దేవునికి అనుగుణంగా ఉండు వైఖరులు కావు; ఇవి ఆయన మన కొరకు నిర్ణయించిన మాదిరులు కావు. ఇలాంటి పనులను మనము చేసినప్పుడు, మనము స్వార్థపూరితముగా ఆలోచన చేస్తాము, మరియు మనలను మనము సంతోషపరచుకొనుటకు ప్రయత్నిస్తాము. మనము పాపభరితమైన లోకము మరియు అపవాది యొక్క మాదిరులను అనుసరించుచున్నాముగాని, కనికరము మరియు నీతిగల దేవునిని అనుసరించుటలేదు.

మీరు ప్రేమించు ఒక వ్యక్తితో మీరు చేసిన ఒక వాదనను గూర్చి ఆలోచన చెయ్యండి. వారు మీ తల్లిదండ్రులు కావచ్చు, బిడ్డలు కావచ్చు, జీవితభాగస్వామి కావచ్చు, లేక సన్నిహిత మిత్రుడు కావచ్చు. కొన్నిసార్లు ఇట్టి వాదనలు కోపమును మరియు గాయములను కలిగిస్తాయి. కాని చాలాసార్లు, మన కోపము ఈ ప్రజల పట్ల మనము కలిగియుండు ప్రేమను అధిగమించలేదు. మన కోపములో కూడా, మనము వారి పట్ల సమర్పణ కలిగియుంటాము. మనము వారిని ప్రేమిస్తాము. అప్పటికీ వారితో దుర్వ్యవహారం చేయబడుటను మనము చూడలేము.

అనేక విధాలుగా, మన విరోధులను గూర్చి మనము కూడా ఇలానే భావించాలని దేవుడు కోరుచున్నాడు. వారి శ్రేయస్సు కొరకు మనము నిజాయితీగల ఆసక్తిని కలిగియుండాలి. మరియు ఇట్టి నిజాయితీగల ఆసక్తి క్రియల రూపములో వ్యక్తపరచబడాలి. వారి పట్ల కనికరముకలిగియుండునట్లు, వారి కొరకు ప్రార్థించునట్లు, వారిని భద్రపరచునట్లు, మరియు వారు అవసరతలో ఉన్నప్పుడు వారికి సమకూర్చునట్లు అది మనలను పురికొల్పాలి.

ఇప్పుడు, దేవుని సామాన్య కృపను మనము అనుకరించు విధానములో మనము కనీసం ఒక అర్హతను అయినా తెలియజేయాలి. విశేషముగా, ఇట్టి ప్రేమ న్యాయము కొరకు ఆశను విసర్జించదు అని మనము ప్రస్తావించాలి. దుష్టుల మీద తీర్పును జరిగించుట కొరకు కొన్నిసార్లు దేవుడు కనికరమును ఇచ్చుట మానతాడు. మరియు దేవుని తీర్పులు ఎల్లప్పుడు మంచివి మరియు సరియైనవి. అంతేగాక, న్యాయము ప్రేమలో ఒక ప్రాముఖ్యమైన అంశము అయ్యున్నది అని లేఖనము బోధిస్తుంది. కీర్తనలు 33:5లో మనము చదువునట్లు:

> **ఆయన నీతిని, న్యాయమును ప్రేమించుచున్నాడు; లోకము యెహోవా కృపతో నిండియున్నది (కీర్తనలు 33:5).**

మనకు తప్పు చేసిన వారి మీద న్యాయమును ఆశించుట ప్రేమకు విరుద్ధమైన విషయము ఏమి కాదు. వాస్తవానికి, ఆదర్శవంతముగా, దేవుని సామాన్య కృపను మనము నిజముగా అనుకరించినప్పుడు, న్యాయము కొరకు మన ఆశ, దేవుని యెడల మన ప్రేమ, మన పొరుగువారి పట్ల మన ప్రేమ, మరియు మన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విరోధుల యెడల మన ప్రేమ అన్నీ పోలికగలవిగా కనిపిస్తాయి. దీనికి కారణం చాలా సులువైనదిగా ఉన్నది న్యాయమైన దేవుడు పాపులను పశ్చాత్తాపము మరియు రక్షణలోనికి నడిపించుటకు మార్గముగా తన తీర్పులను ఉపయోగించుకుంటాడు. ఉదాహరణకు, జెకర్యా 14:16లో, దేశములకు విరోధముగా దేవుని తీర్పు మారుమనస్సులోనికి నడిపించింది:

> మరియు యెరూషలేముమీదికి వచ్చిన అన్యజనులలో శేషించినవారందరును సైన్యములకు అధిపతియగు యెహోవాయను రాజునకు మ్రొక్కుటకును పర్ణశాలపండుగ ఆచరించుటకును ఏటేట వత్తురు (జెకర్యా 14:16).

మనము కూడా దేవుని న్యాయమును ఆశించినప్పుడు, మన అంతిమ హేతువు ప్రేమ అయ్యుండాలి. దేవుని న్యాయము జీవములోనికి నడిపించు మారుమనస్సులోనికి నడిపించాలని మనము నిరీక్షించాలి.

దేవుని ప్రేమ సంక్లిష్టమైనది. దానిని మనము అతిగా సులభతరము చేయుటకు ప్రయత్నిస్తే, దుష్టులకు విరోధముగా తీర్పును ఆశించు సమయములోనే మన పొరుగువారిని ప్రేమించుట, లేక లోకములోని దుష్టత్వమును ద్వేషిస్తునే మనము వారిని ప్రేమించలేము అని తప్పుగా నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. అయితే దేవుని ప్రేమలో న్యాయము కొరకు ఆశ మరియు దుష్టత్వము పట్ల ద్వేషము రెండు భాగమైయున్నవి అని లేఖనము బోధిస్తుంది. కాబట్టి, న్యాయము కొరకు మన ఆశలు మరియు దుష్టత్వము యెడల మన ద్వేషము మానవాళి అందరి కొరకు మనము కలిగియున్న ప్రేమలో భాగమైయున్నది అని తెలుసుకొనుట క్రైస్తవులముగా మనకు దీని యొక్క పరిష్కారం అయ్యున్నది. ఈ భావనలను ప్రేమ నుండి దూరము చేసినప్పుడు, అవి పాపములు అవుతాయి. అయితే అవి ప్రేమ యొక్క వ్యక్తీకరణలు అయినప్పుడు, అవి నీతిగలవి, అవి దేవుడు ఆమోదించు విధానములలో ఆలోచించుటకు, మాట్లాడుటకు మరియు కార్యములు చేయుటకు మనలను పురికొల్పుతాయి.

ఆజ్ఞాధారకత్వము మరియు క్రియలను గూర్చి ఇప్పటి వరకు మాట్లాడాము కాబట్టి, ఇప్పుడు అనురాగమును చూచుటకు సిద్ధముగా ఉన్నాము, ఇది స్పష్టముగా ప్రేమ యొక్క భావాత్మక భాగమైయున్నది.

## అనురాగము

బైబిలులోని ప్రేమ పూర్తిగా క్రియలు మరియు ఆలోచనలలో వ్యక్తపరచబడినది అన్నట్లు క్రైస్తవ బోధకులు కొన్నిసార్లు మాట్లాడుతుంటారు. ఉదాహరణకు, క్రియాశీలమైన విధానములలో మనము ప్రేమించాలని బైబిలు మనకు ఉపదేశిస్తుంది కాబట్టి భావనాత్మకముగా మనము ఎలా ఉన్నా ఫర్వాలేదు అని కొందరు వాదిస్తారు. దేవుని యెడల ప్రేమలో బాహ్యముగా దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సంఘమునకు వెళ్లుట, ప్రార్థనలను చేయుట, బైబిలు చదువుట, మరియు నిశ్శబ్ద సమయములను పాటించుట వంటి పనులను చేయుటలో దేవుని ప్రేమ కనబడుతుంది అని వారంటారు. మరియు కోపగించుకొనకపోవుట, మర్యాదగా వ్యవహరించుట, అతిశయపడుటను మానుట వంటి వాటిలో పొరుగువాని పట్ల ప్రేమ ఉన్నది. అయితే దీనిని గూర్చి బైబిలు మనకు పూర్తిగా భిన్నమైన దృష్టికోణమును ఇస్తుంది. 1 కొరింథీ. 13:1-3లోని మాటలను జ్ఞాపకము చేసుకోండి:

> మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును. ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసముగలవాడనైనను, ప్రేమలేనివాడనైతే నేను వ్యర్థుడను. బీదలపోషణకొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేనివాడనైతే నాకు ప్రయోజనమేమియు లేదు (1 కొరింథీ. 13:1-3).

ఇక్కడ పౌలు వర్ణించిన సత్క్రియలు హృదయపూర్వక అనురాగము ద్వారా పురికొల్పబడినప్పుడు నైతికముగా మంచివి అవుతాయి. కాని అవి అలా పురికొల్పబడనప్పుడు, అవి పనికిరానివి అవుతాయి. ప్రేమ లేకుండా, భాషలు అను ఆత్మీయ వరము గణగణలాడు తాళము అయిపోతుంది. ప్రవచనము, జ్ఞానము మరియు విశ్వాసము గలవాడు శూన్యుడే అవుతాడు. మరియు తన ఆస్తులతో సహా జీవితమును కూడా ధారపోయువాడు ఏమి తిరిగి పొందుకోలేడు. ప్రేమ అనునది మనము చేయు ప్రతిక్రియ యొక్క భావనాత్మక కోణమైయున్నది. అది లేకుండా, మనము చేయు ఏది కూడా మంచిగా పరిగణించబడదు.

యేసు ఈ కఠినమైన విమర్శను చేసిన మత్తయి 15:7-9ని పరిగణించండి:

> వేషధారులారా - ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; ... వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యెషయా మిమ్మునుగూర్చి ప్రవచించిన మాట సరియే (మత్తయి 15:7-9).

ఇక్కడ యేసు చెప్పగోరు విషయము చాలా సులువైనది — అనురాగము లేకుండా దేవుని ఘనపరచుట మరియు ఆరాధించుట వేషధారణ అవుతుంది. మన క్రియలు దేవుని కొరకు చేయబడినా లేక ఇతర ప్రజల కొరకు చేయబడినా, అవి నిజాయితీగల అనురాగ భావనతో పురికొల్పబడాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సత్క్రియలను పురికొల్పు ప్రేమలోని కోణములుగా మనము పలు అనురాగములు లేక భావనలను గూర్చి చర్చించవచ్చు, కాని రెంటిని ప్రస్తావించుటకు మాత్రమే సమయము అనుకూలిస్తుంది. మొదటిగా, మనము దేవుని యెడల కృతజ్ఞతకలిగియుండుటను గూర్చి మాట్లాడదాము. మరియు రెండవదిగా, దేవుని భయమును పరిగణిద్దాము. కృతజ్ఞత కలిగియుండుట దేవుని ప్రేమించునట్లు మరియు మన పొరుగువారిని సంరక్షించునట్లు మనలను పురికొల్పు విధానమును చూస్తూ ఆరంభిద్దాము.

## కృతజ్ఞత కలిగియుండుట

లేఖనములో, దేవుని కృపకు మరియు దయకు మనము ఇచ్చు సాధారణమైన స్పందన కృతజ్ఞత కలిగియుండుట అయ్యున్నది మరియు ఇది ఆయనకు విధేయత చూపునట్లు మనలను పురికొల్పాలి. ఉదాహరణకు, దేవుని దయను గూర్చిన ఒక వ్యాఖ్యతో పది ఆజ్ఞలు పరిచయం చేయబడ్డాయి. తరువాత ఉన్న ఆజ్ఞలను మనము ఆచరించునట్లు ఈ దయ మనలను కృతజ్ఞులనుగా చేయాలి. నిర్గమ. 20:2 పది ఆజ్ఞలను పరిచయం చేయు విధానమును వినండి:

> నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని (నిర్గమ. 20:2).

ఇశ్రాయేలుకు దేవుడు పది ఆజ్ఞలను ఇచ్చిన సమయములో, ఐగుప్తు నుండి నిర్గమనము చరిత్రలో జరిగియుండిన అతి గొప్ప విమోచన కార్యముగా ఉండేది. ఇది క్రొత్త నిబంధనలో క్రీస్తు అర్పించిన బలికి పాత నిబంధన సమాంతర సన్నివేశము అయ్యున్నది — తమ పాఠకులలో కృతజ్ఞతను ప్రేరేపించుటకు బైబిలు రచయితలు తరచుగా ప్రస్తావించిన సన్నివేశము.

నిర్గమ. 20లో పది ఆజ్ఞలను గూర్చిన పరిచయం తరువాత వెంటనే మనము పది ఆజ్ఞలను చూస్తాము. శతాబ్దములుగా అనేకమంది వేదాంతవేత్తలు గుర్తించినట్లు, ఈ ఆజ్ఞలు రెండు గుంపులుగా విభాగించబడినవి: మొదటిగా, దేవుని ప్రేమించుట అంటే ఏమిటో క్రోడీకరించు ఆజ్ఞలు; రెండవదిగా, పొరుగువారిని ప్రేమించుట అంటే ఏమిటో క్రోడీకరించు ఆజ్ఞలు.

కాబట్టి, పది ఆజ్ఞలలో, దేవుని పట్ల హృదయపూర్వకమైన కృతజ్ఞత కలిగియుండుట మన రాజుగా దేవుని పట్ల మరియు ఆయన ప్రియమైన సృష్టములముగా మరియు పిల్లలుగా దేవుని పట్ల ఆజ్ఞాధారకత్వము, క్రియలు మరియు తదుపరి అనురాగము కొరకు ప్రేరేపించు హేతువుగా ఉండుటకు ఉద్దేశించబడింది.

మరియు క్రొత్త నిబంధన కూడా ఇదే నియమమును బోధిస్తుంది. మనము ఇంతకు ముందు చెప్పినట్లు, మన కృతజ్ఞతకు ఆధారముగా క్రీస్తు యొక్క బలిని మరింత తరచుగా ఉపయోగించుచున్నట్లు

అనిపిస్తుందిగాని, ఇక్కడ భావన మాత్రము ఒకటే అయ్యున్నది: దేవుని దయ మన ప్రేమ మరియు విధేయతకు అర్హమైనది. 1 యోహాను 4:19లో యోహాను వ్యాఖ్యానించినట్లు:

> ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము (1 యోహాను 4:19).

మరియు కొలస్సీ. 3:17లో పౌలు వ్రాసినట్లు:

> మరియు మాట చేత గాని క్రియచేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి (కొలస్సీ. 3:17).

ఆయన కుమారుని బహుమానముగా ఇచ్చినందుకు మనము చూపు కృతజ్ఞత మన ప్రభువును ప్రేమించునట్లు మరియు ఆయన నామమున, ఆయన మహిమ కొరకు చేయు సత్క్రియల ద్వారా ప్రేమను వ్యక్తపరచునట్లు పురికొల్పుతుంది.

కృతజ్ఞత కలిగియుండుట హేతువుగా ఎలా పనిచేస్తుందో అర్థము చేసుకొనుట అంత కష్టమేమి కాదు. మనలో చాలామందికి కృతజ్ఞత కలిగియుండుటకు అనేక కారణాలు ఉన్నాయి. మన తల్లిదండ్రులు మనలను పోషించిన విధానమును బట్టి వారికి మనము కృతజ్ఞులమైయుండవచ్చు, లేక మన అధ్యాపకులు మనకు మార్గదర్శకములను ఇచ్చిన విధానమును బట్టి వారికి కృతజ్ఞులమైయుండవచ్చు. ప్రజలు మనలను అపాయము లేక ఒత్తిడి నుండి విడిపించినప్పుడు మనము వారికి కృతజ్ఞులమైయుంటాము. మరియు ఈ సందర్భములన్నిటిలో, మనకు సహాయము చేసిన ప్రజలకు కృతజ్ఞత తెలుపుట మరియు వీలైనంత వరకు వారికి ఆ ఉపకారమునకు తగిన ఉపకారమును చేయుట మన ప్రతిస్పందన అయ్యుంటుంది.

ఒక వైపున, మన జీవితములలో కృతజ్ఞతలేమిగల ప్రజలను గూర్చి, అనగా ఇతరులు వారి కొరకు చేసిన సత్క్రియలను గుర్తించని ప్రజలను గూర్చి ఆలోచించుట చాలా సులువైన పనియే. మనము కృతజ్ఞతలేనివారిగా ఉన్నప్పుడు, మనకు సహాయము చేసిన ప్రజలకు సహాయము చేయు ఆశ మనలో ఉండదు. బదులుగా, వారి సహాయము మన న్యాయపరమైన ప్రతిఫలము అయ్యున్నది అన్నట్లు దానిని మనము పొందుకుంటాము, మరియు వారు మనము ఆశించు విధముగా పనులను చేయనప్పుడు కోపపడతాము. ఇతరులను ప్రేమించుటకు పురికొల్పుట కాదుకదా, కృతజ్ఞతలేమి ఇతరులను తృణీకరించునట్లు చేస్తుంది.

స్పష్టముగా, క్రైస్తవులముగా, దేవుని యెడల మనము కలిగియుండు కృతజ్ఞత భావన ఆయనకు విధేయతను చూపునట్లు, మరియు ఆయన ప్రేమించువారికి సహాయము చేయునట్లు మనలను పురికొల్పాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రీస్తు అను బహుమానమునకు దేవునికి మనము ఏవిధముగా ప్రతియుపకారమును చేయలేము, కాబట్టి మనము చేయు సత్క్రియలు ఆయనకు ప్రతియుపకారము చేయుట కానేకాదు. అవి దేవుడు చేసిన క్రియలను గుర్తించు ప్రజలు ప్రేమతో ఇచ్చు ప్రతిస్పందనలు మాత్రమే అయ్యున్నవి. దేవుడు వారి కొరకు చేసిన కార్యముల విషయములో నిజముగా కృతజ్ఞులైయున్నవారు అబద్ధ దేవతలకు మ్రొక్కుట ద్వారా, లేక ఆయన నామమును వ్యర్థముగా ఉచ్చరించుట ద్వారా, లేక ఆయనకు దుఖము కలిగించు ఏ ఇతర కార్యమునైనా చేయుట ద్వారా ఆ కృతజ్ఞతను వ్యక్తపరచలేరు. మనము ఊహించలేని అతిగొప్ప బహుమానమును పొందాము. మన నిబంధన ప్రభువుకు మనలను మనము పూర్ణహృదయముతో ఎందుకు సమర్పించుకోలేము?

కృతజ్ఞత కలిగియుండుట సత్క్రియలు చేయుట కొరకు మనలను ఎలా పురికొల్పవలసియున్నదో చూశాము కాబట్టి, దేవుని యెడల మన ప్రేమలో భాగమైయున్న మరియు మన సత్క్రియలను పురికొల్పు దేవుని భయమును గూర్చి ఇప్పుడు మాట్లాడదాము.

## భయము

ఆధునిక సంఘములో, క్రైస్తవులు దేవునియందు భయము కలిగియుండుటను గూర్చి ఎక్కువగా మాట్లాడరు. దీనికి కారణము ఈ భావన బహుగా అపార్థము చేసుకోబడినది అగుట కావచ్చు. ఆధునిక క్రైస్తవులు భయమును గూర్చి ఆలోచించునప్పుడు, సాధారణంగా మనము దానిని భీతి మరియు దిగులుతో అనుసంధానం చేస్తాము. మనకు హాని కలిగించు, మనకు విరోధముగా కీడును తలంచు విషయములంటే మనకు భయము. అవును, నిస్సందేహముగా బైబిలు "భయము" అను పదమును ఈ భావనలో కూడా ఉపయోగిస్తుంది. కాని ఇట్టి దేవుని భయమునకు ఒక విశ్వాసి జీవితములో ఎలాంటి భాగము లేదు. అపొస్తలుడైన యోహాను 1 యోహాను 4:17-18లో ఇలా వ్రాస్తున్నాడు:

> తీర్పుదినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరిపూర్ణము చేయబడి యున్నది; ఏలయనగా ఆయన ఎట్టివాడై యున్నాడో మనము కూడ ఈ లోకములో అట్టివారమై యున్నాము. ప్రేమలో భయముండదు; అంతేకాదు; పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును; భయము దండనతోకూడినది; భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు (1 యోహాను 4:17-18).

క్రైస్తవులలో ప్రేమ పరిపూర్ణమవుతుంది, మరియు ఈ పరిపూర్ణమైన ప్రేమ భయమును తొలగిస్తుంది ఎందుకంటే దేవుడు ఏనాడు మనకు హాని కలిగించడు. కాబట్టి, దేవునియెడల భయమును గూర్చి భావార్థకమైన రీతిలో మాట్లాడునప్పుడు లేఖనము ఉద్దేశించు భయము ఇది కాదు. మన మనస్సులో ఉన్న భయమును ద్వితీ. 10:12-13లో ఈ విధముగా వర్ణిస్తాడు. అక్కడ అతడు వ్రాసిన మాటలను వినండి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> కాబట్టి ఇశ్రాయేలూ, నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయన మార్గములన్నిటిలో నడుచుచు, ఆయనను ప్రేమించి, నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణ మనస్సుతోను నీ పూర్ణాత్మతోను సేవించి, నీ మేలుకొరకు నేడు నేను నీకాజ్ఞాపించు యెహోవా ఆజ్ఞలను కట్టడలను అనుసరించి నడుచుకొందువను మాట కాక నీ దేవుడైన యెహోవా నిన్ను మరి ఏమి అడుగుచున్నాడు? (ద్వితీ. 10:12-13).

ఇక్కడ మోషే ఇచ్చిన బాధ్యతల మధ్య కొన్ని సంక్షిప్త భిన్నత్వములు ఉన్నప్పటికీ, అవన్నీ ప్రధానముగా ఒకటే అయ్యున్నవి. భయపడి, నడుచుచు, ప్రేమించి, సేవించి, అనుసరించి — ఇవన్నీ దేవునికి మరియు ఆయన ఆజ్ఞలకు పూర్ణహృదయముతో, స్వామిభక్తికలిగి, క్రియాశీలకముగా విధేయత చూపుటను సూచిస్తాయి.

సులభతరము చేయుట కొరకు, దేవునియందలి భయమును "దేవుని యెడల అనురాగము, ప్రేమ మరియు ఆరాధనను ఉత్పత్తిచేయు దేవునియెడల భయము, గౌరవము మరియు మర్యాద" అని నిర్వచించవచ్చు. కొంత వరకు, ఇట్టి భయము క్రీస్తు యొక్క నిజమైన విశ్వాసియైన ప్రతి ఒక్కరిలో కనబడుతుంది. ఉదాహరణకు, యెషయా 33:5-6లో మనము ఈ మాటలు చదువుతాము:

> నీకాలములో నియమింపబడినది స్థిరముగానుండును. రక్షణ బాహుళ్యమును బుద్ధిజ్ఞానముల సమృద్ధియు కలుగును; యెహోవా భయము వారికి ఐశ్వర్యము (యెషయా 33:5-6).

గమనించండి గౌరవముతో కూడిన భయము భీతిని కలిగించు వ్యక్తీకరణగాగాక, మన నిశ్చయమైన స్థిరత్వముగాను, రక్షణగాను దేవునియందలి నిశ్చయతతో అనుసంధానము కలిగియున్నది.

యెషయా 11:2-3లో, ఈ భయము మెస్సీయ యొక్క గుణము కూడా అయ్యున్నది అని మనము చూస్తాము. ప్రవక్త యొక్క మాటలను వినండి:

> యెహోవా ఆత్మ జ్ఞానవివేకములకు ఆధారమగు ఆత్మ, ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ, తెలివిని యెహోవాయెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతనిమీద నిలుచును;యెహోవా భయము అతనికి ఇంపైన సువాసనగా ఉండును (యెషయా 11:2-3).

గౌరవముతో కూడిన భయము అంటే కంగుతో, బెదిరింపబడి దేవునికి స్పందించుట కాదు. భిన్నముగా, ఇది ఒక ఆనందము అయ్యున్నది. అంతేగాక, అపొ. 9:31లో మనము చదువునట్లు, ఇలాంటి భయమే ఆదిమ సంఘములో కూడా కనబడుతుంది. అక్కడ వ్రాయబడియున్న మాటలను వినండి:

కావున ... సంఘము క్షేమాభివృద్ధినొందుచు సమాధానము కలిగియుండెను; మరియు ప్రభువునందు భయమును పరిశుద్ధాత్మ ఆదరణయు కలిగి నడుచుకొనుచు విస్తరించుచుండెను (అపో. 9:31)

మరొకసారి, భయము అనునది సమాధానము, బలము మరియు ప్రోత్సాహముతో అనుబంధము కలిగియున్నదిగాని, భీతి లేక కంగుతో అనుసంధానము చేయబడలేదు.

దేవుని యెడల గౌరవముతో కూడిన భయము ఆయన స్థిరమైన సన్నిధిలో నివసించు భావన అయ్యున్నది. అది దేవుడు ఎవరు మరియు ఏమిటి, మరియు ఆయన మన నుండి ఏమి ఆశించుచున్నాడు అను అవగాహన అయ్యున్నది. ఈ విధముగా, అది ప్రేమకు సంబంధించినది అయ్యున్నది మరియు సత్క్రియలు చేయుటకు హేతువు అయ్యున్నది. ఇది ప్రేమకు సంబంధించినది అయ్యున్నది, ఎందుకంటే ఇది దేవుని వైభవము మరియు మంచితనమును ఉద్ఘాటించుట మరియు గుర్తింపుతో స్పందించుట అయ్యున్నది; ఇది ఆయన స్వభావము యెడల బలమైన అనురాగము మరియు ఇష్టము అయ్యున్నది. మనము ప్రేమించువాని ఘనపరచాలని మరియు మహిమపరచాలని మనము కలిగియుండు ఆశ ద్వారా సత్క్రియలను చేయుటకు మనలను పురికొల్పుతుంది.

ఈ దృక్కోణము మనలో లేనప్పుడు, క్రైస్తవ నీతిశాస్త్రముకు ఉదాసీనత మరియు సోమరితనముతో వ్యవహరించుట సులభమవుతుంది. దేవుడు దూరముగా ఉన్నాడు అని, ఆయన మన జీవితముల మీద మోపు బాధ్యతలను పెద్దగా పట్టించుకోవలసిన పనిలేదు అని ఆలోచన చేయుట చాలా సులభమవుతుంది. దేవుని రాజ్యమును వెదకుటకు బదులుగా, మనము కేవలం భూలోకము మీద మాత్రమే దృష్టిపెడతాము. ఫలితంగా, దేవుని బయలుపరచబడిన చిత్తమునకు అనుగుణంగా మన జీవితములను నియంత్రించుకోవలసిన అవసరతను మనము కలిగియుండలేము.

అయితే దేవుని యెడల సరియైన గౌరవముతో కూడిన భయమును మనము కలిగియుండునప్పుడు, అనేక విధాలుగా ఆయనను సంతోషపరచునట్లు అది మనలను పురికొల్పుతుంది. ఈ హేతువు యొక్క పరిణామాలను లేఖనము అనేకచోట్ల ప్రస్తావిస్తుంది. అయితే వీటిలో ఎక్కువ శాతం పాత నిబంధనలోని జ్ఞాన సాహిత్యములో ఉన్నవి. ఉదాహరణకు, యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము అని 1:7లో; జ్ఞానమునకు మూలము అని 9:10లో, మరియు జీవపుఊట అని 14:27లో సామెతలు గ్రంథము బోధిస్తుంది. 10:27 ప్రకారం అది దీర్ఘాయువును కలిగిస్తుంది. 16:6లో అది కీడును తప్పించుకొనుటలో సహాయపడుతుంది. 22:4 ప్రకారం అది ఐశ్వర్యమును మరియు ఘనతను కలిగిస్తుంది. ఇవి మరియు అనేక ఇతర మంచి ఫలితములు దేవునియందలి భయభక్తులు కలిగియుండుట వలన కలుగుతాయి. నిజమైన జ్ఞానము మరియు నీతిశాస్త్రమును ప్రసంగి 12:13 క్రోడీకరించు విధానమును వినండి:

> **దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను, మానవకోటికి ఇదియే విధి (ప్రసంగి 12:13).**

దేవునియందలి భయము మన దేవుడు మరియు రాజును సంతోషపరచు విధానములలో ఆలోచించుటకు, మాట్లాడుటకు మరియు కార్యములు చేయుటకు మనలను పురికొల్పవలసియున్నది. ఆయన ఆజ్ఞలను పాటించి, ఆయన ప్రేమించు సృష్టములకు మేలు చేయునట్లు అది మనలను పురికొల్పాలి.

కాబట్టి ప్రేమ అనేక విధాలుగా సత్క్రియలకు హేతువుగా పని చేస్తుంది అని మనము చూశాము. ఆజ్ఞాధారకత్వములో, దేవుని యెడల మరియు మన పొరుగువారి యెడల మనము కలిగియున్న బాధ్యతను నెరవేర్చునట్లు మనలను పురికొల్పుతుంది. క్రియలలో, దేవుని మహిమపరచు మరియు మన పొరుగువారికి ప్రయోజనము చేకూర్చు పనులను చేయునట్లు మనలను పురికొల్పుతుంది. మరియు అనురాగములో, మన ప్రియమైన ప్రభువును సేవించుట ద్వారా, మన పొరుగువారి శ్రద్ధ వహించుట ద్వారా సంతోషపరచునట్లు అది మనలను పురికొల్పుతుంది.

## ముగింపు

మేలును ఉద్దేశించుటను గూర్చిన ఈ పాఠములో, అస్తిత్వ దృష్టికోణమును గూర్చిన మన సంభాషణ హేతువు అను భావన మీద దృష్టిపెట్టింది. హేతువుల యొక్క ప్రాముఖ్యతను చూచుట ద్వారా, బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొను ప్రక్రియలో హేతువులు పోషించు పాత్రను చూచుట ద్వారా మనము ఆరంభించాము. తరువాత, ప్రతి మంచి నిర్ణయములో భాగమైయున్న రెండు ప్రాముఖ్యమైన హేతువుల మీద మనము దృష్టిపెట్టాము: మన ఆరంభ రక్షణ మరియు మన కొనసాగు క్రైస్తవ జీవితములు రెంటిలో విశ్వాసము అను హేతువు; ఆజ్ఞాధారకత్వము, క్రియలు మరియు అనురాగమును కలిగియున్న ప్రేమ అను హేతువు.

క్రైస్తవులు అనుదినము అనేక నైతికమైన నిర్ణయములను తీసుకోవలసియుంటుంది. అనేక సందర్భాలలో, మన వ్యక్తిత్వములను గూర్చి ఆత్మపరిశీలన చేయుట కాదుకదా, మన బాధ్యత ఏమిటో మరియు వాస్తవములు ఏమిటో కనుగొనుట కూడా చాలా కష్టమవుతుంది. అయినను, మన నిర్ణయాలు నిజముగా బైబిలానుసారమైనవిగా ఉండాలంటే, మన ఉద్దేశములను విశదీకరించుటకు మనము ప్రయత్నము చేయాలి. మనము చేయు ప్రతిది దేవునియందలి మన విశ్వాసము ద్వారా మరియు దేవునియెడల మరియు పొరుగువాని యెడల మనము కలిగియున్న ప్రేమ ద్వారా పురికొల్పబడునట్లు మనము చూచుకోవాలి. మన

ఉద్దేశములను మనము స్పష్టముగా ఉంచుకొనినప్పుడు, దేవుని ఘనపరచు మరియు మహిమపరచు నిర్ణయములను తీసుకొనుటకు మరి ఉత్తమమైన రీతిలో మనము సిద్ధపడగలము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.